ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 25 | సంచిక : 8,9 | ఏప్రియల్, మే 2020

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 40

గౌరవ సంపాదకులు
శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
9441122622
7780639977

ఈ సంచికలో. .

30-12-2007, జిన్నూరు
అరుణాచల మహత్యం
శ్రీమద్భగవద్గీత

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## శ్రీ రామచంద్రుడు

(శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)



శ్రీరామనవమి అంటే శ్రీ రామచంద్రుడు పుట్టిన రోజు. కాశీలో దశాశ్వమేధఘాట్ దగ్గర, గంగానదీ తీరంలో, దశరథ మహారాజు చేత ఋష్యశ ృంగుడు పుత్రకావేష్టి యజ్ఞం చేయించాడు. తరువాత శ్రీ ఖరనామ సంవత్సరం, చైత్రమాసం,శుద్ధ నవమి రోజున, కర్కాటక లగ్నంలో, సూర్యుడుమేష రాశిలో ఉండగా కౌశల్య గర్భాన శ్రీరాముడు జన్మించాడు. రాముడు పుట్టిన వారం బుధవారం. బుధవారం పుట్టినవాళ్ళు సౌమ్యంగా ఉంటారని, చేస్తే మంచి చేస్తారు కాని ఎవరికీ చెడ్డ చెయ్యరనీ, ఇలా ఒక్కోవారంలో పుట్టిన వాళ్లకి ఒక్కో విశేషం మన పెద్దలు చెపుతారు.

మేము రాక్షసుల బాధ భరించలేకపోతున్నాము, మమ్మల్ని యజ్ఞాలు సత్కర్మలు చేసుకోనివ్వటం లేదు, భయ పెట్టేస్తున్నారు అని ఋషులు సనత్కుమారునితో చెప్తారు. మీరు కొంతకాలం ఓపిక పట్టాలి. భవిష్యత్తులో మహావిష్ణువు రాముడిగా జన్మించి రాక్షస సంహారం చేస్తాడు. అప్పటివరకూ మీకు కొన్ని బాధలు తప్పవు అని సనత్కుమారుడు ఋషులకు చెప్పాడు.

రాముడికి అన్నీ కళ్యాణగుణాలే. వాల్మీకి రామాయణం రాసేముందు పదహారు మంచిగుణాల గురించి నారదుడిని

అడుగుతూ, ఈ పదహారు గుణాలు ఉన్నవాళ్ళు ఈ భూమి మీద ఎక్కడైనా సంచరించారా అని అడిగితే, ఈ పదహారు గుణాలు శ్రీరాముడిలో ఉన్నాయని నారదుడు చెప్పాడు. రాముడిలో ఒక వందైనా మంచి గుణాలు ఉన్నాయి, అందులో ముఖ్యమైనవి 16 లక్షణాలు గురించి వాల్మీకి నారదుడిని అడిగాడు. మీకు ఈ పదహారు గుణాలు అక్కరలేదు, ఒక మంచి గుణం ఉంటే మీరు అందరూ రాముడితోటి సమానం అయిపోతారు.

రాముడి గురించి వాల్మీకి మాట్లాడుతూ,రాముడు మితభాషి, హితభాషి, ప్రియభాషి. రాముడు పూర్వభాషి కూడా అన్నాడు వాల్మీకి, అంటే ఎదుటి వాళ్ళు పలకరించకుండా ముందు రాముడు పలకరిస్తాడు. మనం ఎదుటి వాళ్ళు పలకరించకుండా ముందు పలకరించము, బెట్టుసరిగా ఉంటాము. రాముడు బెట్టుసరిగా ఉండడు. ఎదుటివాళ్ళు పలకరించకుండా ఆయన ముందే మాట్లాడతాడు, పూర్వభాషి. రాముడుమితభాషి కూడా. ఎంతవరకూ మాట్లాడాలి, ఎంతవరకూ మాట్లాడకూడదు. మాట్లాడకూడనిది మాట్లాడడు, అప్రియమైనది మాట్లాడడు. మితభాషి, ప్రియ భాషి. ఆ మాట్లాడేది ఏదో ప్రియంగానే మాట్లాడతాడు, అప్రియంగా మాట్లాడడు. తగుమాత్రం గానే మాట్లాడతాడు.

రాముడు రాక్షస సంహారం గురించి జన్మించినా, ఒక మానవుడిగా కనిపించి, మానవుడికి ఎన్ని కష్టసుఖాలు వస్తాయో, అవి అన్నీ అనుభవించి చూపించాడు. మాకు ఉ న్న కష్టాలు ఎవరికీ లేవేమో అని మీరు అనుకుంటారు. మీకు ఉన్న కష్టాల కంటే వంద రెట్లు ఎక్కువ కష్టాలు రాముడు అనుభవించాడు. రామాయణం చదివితే మీకు తెలుస్తుంది. రాముడు ధర్మ స్వరూపుడు, ధర్మమేరాముడి రూపం ధరించింది అని దేవతలు చెప్పలేదు, మనుషులు చెప్పలేదు, ఒక రాక్షసుడు చెప్పాడు. మారీచుడిని దొంగలేడి వేషంలో వెళ్ళమంటాడు రావణాసురుడు. రాముడు సామాన్యుడు కాదు, ధైర్యవంతుడు, సాహసవంతుడు. ఎవరినైనా చంపాలంటే ఆయుధాలు అక్కరలేదు, రాముడు చేతితోటి ముట్టుకుంటే చచ్చిపోతారు, అంత బలవంతుడు. రాముడంటే, ధర్మమే ఒక శరీరంగా జన్మించింది. రాముడి జోలికి మనం వెళ్ళటం మంచిది కాదు. రాముడు మహాత్ముడు, అధర్మం ఎలా ఉంటుందో రాముడికి తెలియదు అని మారీచుడు రావణాసురుడికి చెప్పాడు.

ధర్మం అంటే మన మనస్సుని, ఇంద్రియాలని నిదానంగా ఉంచుకుని, నిగ్రహంగా ఉంచుకొని అన్యాయం వైపుకి వెళ్ళకుండా జీవితం పొడుగునా న్యాయంగా జీవించటం. మనం కూడా ఎంతోకొంత ధర్మాన్ని ఆచరిస్తున్నాము కానీ, రాముడికి మనకి తేడా ఏమిటి అంటే, రాముడు ఎట్టి పరిస్థితులలోనూ, వాడికి ప్రాణం పోయినా ధర్మాన్ని విడిచిపెట్టడు. ఎంత భయం వేసినా, తన ప్రాణానికి భంగం కలిగినా కూడా ధర్మాన్ని ఆచరించటం విడిచిపెట్టలేదు, వాడు రాముడు. మనకి ఏదైనా భయం వేసింది అనుకోండి, ఏదైనా

కోరిక కలిగింది అనుకోండి,ధర్మాన్ని విడిచిపెట్టేస్తాము. కోరిక వల్ల కాని, భయంవల్ల కాని, ఇతరులు మనకి నష్టం కలిగిస్తారు అనేటువంటి అనుమానాల వల్ల కాని, ధర్మంగా జీవించినా మనకి ఏమీ కలిసిరావటం లేదు అనుకొని ధర్మాన్ని వదిలిపెట్టేస్తాము.

భరతుడికి పట్టాభిషేకం చేయమని, రాముడిని పద్నాలుగు సంవత్సరాలు అరణ్యవాసానికి పంపాలని కైకేయి దశరధుడికి చెప్పింది. ధర్మాన్ని విడిచిపెట్టు, పితృవాక్య పరిపాలన చెయ్యవద్దు అని లక్ష్మణుడు రాముడికి చెప్పాడు. ఎట్టి పరిస్థితుల లోనూ ధర్మాన్ని విడిచిపెట్టను అన్నాడు రాముడు. నేను కైకకి వరాలు ఇచ్చిన మాట నిజమే, కాని కైక నిన్ను అరణ్యవాసాలకి పొమ్మన్నా నువ్వు వెళ్ళవద్దు అని దశరధుడు చెప్పాడు. అప్పుడు కూడా రాముడు అంగీకరించలేదు. రాముడు వేరు ధర్మం వేరు కాదు. ధర్మమే రాముడి రూపం ధరించింది. అదే రాముడికి మనకి తేడా.

మనని ఎవరైనా నష్టపరిస్తే మనం చనిపోయేవరకూ వాళ్ళమీద కోపంగా ఉంటాము. రాముడికి కైక మీద కాని దశరధుడు మీద కాని, కించిత్తు కూడా ఎవరిమీదా ఆగ్రహం కలగలేదు. మనకి కోపం వస్తే ధర్మాన్ని విడిచిపెట్టేస్తాము. మీ ధర్మం మిమ్మల్ని ఏం కాపాడింది, ఎందుకిది అని ఎవరైనా అంటే, వెంటనే మనం ధర్మాన్ని విడిచిపెట్టేస్తాము. కాని రాముడు అలా చెప్పుడు మాటలు విని ఎప్పుడూ ఎక్కడా ధర్మాన్ని విడిచిపెట్టలేదు, అందుకే రాముడు దేవుడు అయ్యాడు.

వశిష్టుడు, విశ్వామిత్రుడు వంటి పెద్దవాళ్ళ వద్ద రాముడు ట్రైనింగ్ అయ్యాడు. విశ్వామిత్రుడు అంటే సామాన్యుడు కాదు, సృష్టికి ప్రతిసృష్టి చేసిన వాడు. గాయత్రీ మంత్రాన్ని కనిపెట్టిన వాడు. యజ్ఞాలు రక్షించటానికి రాముడిని తన వెంట పంపించమని విశ్వామిత్రుడు దశరధుడిని అడిగాడు. ఒక మంచి కోసమే పంపించమంటున్నాడు, అందుచేత సందేహించకుండా పంపమని వశిష్టుడు దశరధమహారాజుతో చెపితే, రామలక్ష్మణులని విశ్వామిత్రుని వెంట పంపుతాడు. అది నెపంగా చేసుకొని విశ్వామిత్రుడు రామలక్ష్మణులకు చాలా యుద్ధ రహస్యాలు చెప్పాడు. ప్రవర్తన ఎలా ఉండాలో చెప్పాడు, రాగద్వేషాల వేగం వచ్చినప్పుడు ఎలా తట్టుకోవాలో చెప్పాడు. మంచాల మీద పడుకోబెట్టగల శక్తి ఉన్నప్పటికీ, భవిష్యత్తులో వీళ్ళు అరణ్యవాసం చెయ్యాలి కాబట్టి ముందే గ్రహించి కింద గడ్డిపరిచి దాని మీద పడుకోమన్నాడు. కౌశల్యా సుప్రజా రామా అని ప్రొద్దుటే నిద్రలేపేవాడు విశ్వామిత్రుడు. నువ్వు మేలుకోవయ్యా, అతిగా నిద్రపోవద్దు, బద్ధకం పనికిరాదు, నువ్వు కర్తవ్య కర్మ చెయ్యాలి, ఆ శరీరం ఎందుకు వచ్చిందో ఆ పని చెయ్యాలి. తగిన సమయంలో నిద్ర నుంచి లేవాలి ఓ కౌశల్య కుమారుడా అన్నాడు. నువ్వు మేల్కొనేది నిషిద్ధ కర్మ చెయ్యటానికి కాదు, నిత్య కర్మలు చెయ్యటానికి. సమాజాన్ని ఉద్ధరించటం మాట ఎలా

ఉన్నా, మీ దేహ ధర్మం ప్రకారం, మీ ప్రవృత్తి ప్రకారం, మీరు చేసుకునే దైనందిన కర్మ మీరు మానకూడదు. నిత్యకర్మ చెయ్యకపోతే పొట్ట గడవదు, శరీరయాత్ర కూడా నడవదు. మీ శరీరయాత్ర కోసం ఇతరుల మీద ఆధారపడితే బానిసత్త్వం వస్తుంది.

యజ్ఞ సంరక్షణార్థంతాటకి అనే రాక్షసస్త్రీని సంహరించాలి. రాముడు స్త్రీలను చంపటం నాకు ఇష్టం లేదు అంటాడు. అప్పుడు విశ్వామిత్రుడు అంటాడు, రామా నువ్వు ధర్మాన్ని స్థాపించటానికి ఈ భూమి మీదకు వచ్చావు. రాక్షస సంహారం కోసం ఈ భూమి మీదకి వచ్చావు. అంతే కాదు, మానవజాతికి ఆదర్శంగా ఉండటానికి కూడా ఈ భూమి మీదకి వచ్చావు. నీ డ్యూటీ నువ్వు చేసేటప్పుడు, ధర్మం నిర్వర్తించవలసి వచ్చినప్పుడు అది అశుభకర్మకింద నీకు కనిపించినా, అది చెయ్యవలసిందే రామా అంటాడు. నీ డ్యూటీ నువ్వు చేసేటప్పుడు నీకు ఇష్టంలేని పనులు కూడా చెయ్యవలసి వస్తుంది. ఇవి వ్యక్తిగత విషయాలు కాదు. నువ్వు తాటకిని శత్రుత్వం తోటి,కర్తృత్వం తోటి చంపటం లేదు. నీ ధర్మాన్ని నువ్వు ఆచరించటానికి చంపుతున్నావు కాబట్టి, అది అశుభకర్మగా ఉన్నా, నీకు దోషం రాదు అంటాడు. రాముడు చేసే పని విశ్వామిత్రుడు చేయగలడు కానీ నీ శరీరం ఏ పనిమీద వచ్చిందో ఆ పని నీ శరీరం ద్వారా జరగాలి రామా అంటాడు విశ్వామిత్రుడు.

రాక్షస సంహారం తరువాత యజ్ఞం పూర్తి అయ్యాక, రామలక్ష్మణులను మిథిలా నగరం తీసుకువెళతాడు విశ్వామిత్రుడు. శివధనుస్సు విరిచిన వారికి సీతమ్మను ఇచ్చి వివాహం చేస్తాను అంటాడు జనకమహారాజు. దానిని పూర్వం ఎందరో మహారాజులు ఎత్తలేక ఓడిపోయారు. ఆ శివధనుస్సును నేను ఎత్తుతాను అని రాముడు అనలేదు, కామ్ గా కూర్చున్నాడు. గురువు అయినట్టి విశ్వామిత్రుడు ఎత్తమన్నప్పుడు, రాముడు ఆ శివధనుస్సుని ముట్టుకునేసరికి అది విరిగిపోయింది. అప్పుడు విశ్వామిత్రుడు నీకు సీతమ్మని ఇచ్చి వివాహం చేస్తామంటున్నారు నీకు ఇష్టమేనా అని రాముడిని అడిగితే, నాకు సీతమ్మ ఇష్టం అని చెప్పలేదు. ఇక్కడఏదో వీరత్వం చూపించాను, గొప్ప ఘనకార్యం చేసాను అనిచెప్పి మా తండ్రిగారి అనుమతి లేకుండా చేసేసుకోను, పెద్దల అంగీకారంతోనే చేసుకుంటాను అన్నాడు. అదీ రాముడి యొక్క వైభవం.

రాముడు ఏ పని చేసినా ధర్మం కోసం చేసాడు కాని, తన ప్రయోజనం కోసం ఏదీ చెయ్యలేదు. రాక్షస సంహారం కూడా రాక్షసులని చంపటం కోసం చంపలేదు, సామాన్య మానవుల మీద ప్రేమ వల్ల రాక్షస సంహారం చేసాడు, అరణ్యవాసంలో ఉండగా ఒకసారి సీతమ్మ రాముడితో రాక్షసులుమనజోలికి రావటం లేదు, మనకి దూరంగానే ఉంటున్నారు. ఎవరో మునులని యజ్ఞయాగాలు చేసుకునే వాళ్ళని బాధపెడుతున్నారు, వాళ్ళ జోలికి వెళ్ళటం మనదే తప్పు అని చెపుతుంది. నువ్వు చెప్పింది బాగానే ఉంది, అయితే మనం భూమి

మీదకి ఎందుకు వచ్చినట్టు, వాళ్ళని రక్షించటం కోసమే కదా మనం భూమి మీదకి వచ్చాము. దుష్ట సంహారం, శిష్ట రక్షణ కోసమే కదా వచ్చాము, అంటాడు రాముడు. రాముడి లాంటి మనుషులు ఇప్పుడు కూడా అక్కడక్కడా ఉన్నారు. వాళ్లకి ఏమీ స్వార్థం లేకపోయినా మీకు అభయం ఇస్తాను అని చెపుతారు.

కొంతమంది మంచివాళ్ళు కూడా భయం వేస్తే ధర్మాన్ని వదిలేస్తారు. రాముడికి ఎంత భయం కలిగినా ధర్మాన్ని ఆచరించటం విడిచిపెట్టలేదు. సీత రాముడిని నువ్వు పైకి మగవాడి కింద కనిపిస్తున్నావు, నీకు పురుషుడి లక్షణాలు ఏమీ లేవు, ఉన్నవి అన్నీ స్త్రీ లక్షణాలే అంది. అరణ్యవాసానికి తీసుకువెళ్ళనని చెప్పాడని కోపం వచ్చి అలా అంది. అప్పుడు కూడా ఆయన ఉద్రేకపడలేదు.

రాముడు ఎంత ధర్మస్వరూపుడు అంటే, ఒక సారి పదవి చేసిన వాడికి పదవి కాంక్ష ఉండిపోతుంది, అది పెద్ద రోగం. రాముడు అరణ్యవాసంలో ఉండగా, భరతుడు రాముడి పాదుకలను అర్చిస్తూ అయోధ్యానగరాన్ని రక్షించాడు. పద్నాలుగు సంవత్సరాల అనంతరం రావణుడిని సంహరించి తిరిగి వచ్చాక రాముడు డైరెక్టుగా అయోధ్యలోకి వెళ్ళలేదు. అయోధ్యకి చాలా దూరంలో మకాము వేసి ఆంజనేయస్వామితో నువ్వు భరతుడి దగ్గరికి వెళ్లి నీకు రాజ్యం అంటే ఇష్టంగా ఉంటే రాముడు రాడు అని చెప్పకు, నువ్వువెళ్లి భరతుడి దగ్గర ఒక గంట ఆమాయకుడిలా కూర్చో. రాముడి కోసం వాడి కళ్ళు ఎదురు చూస్తున్నాయా, రాముడు వస్తే మన పదవి పోతుంది అని ఏమైనా బాధ పడుతున్నాడా, వాడి శరీరంలో మనస్సులో కదలికల్ని, వాడి మనస్సుని శరీరాన్ని గ్రహించి బయటికిరా కాని నోరు తెరువవద్దని చెప్పాడు. ఆంజనేయస్వామి సూక్ష్మబుద్ధి కలవాడు, సటిల్ ఇంటలెక్ట్ కలవాడు. భరతుడిని చూసి వచ్చి, రాముడు ఎప్పుడు వస్తాడని ఎదురుచూస్తున్నాడు కాని, రాముడు రాకపోతే మంచిది అన్న తలంపు ఎక్కడా భరతుడి ముఖంలో, శరీరంలో, మనస్సులో కనపడలేదు అన్నాడు. అంచేత మనం అయోధ్యలో ప్రవేశించ వచ్చు దానికి సందేహం లేదు అని చెప్పాడు. భరతుడికి రాజ్యకాంక్ష ఉంటే మనకి వారసత్త్వముగా వచ్చే అయోధ్యని కూడా విడిచిపెట్టేద్దాము అన్నాడు, వాడు రాముడు! అటువంటి రామచంద్రమూర్తికి కనీసం మనం శ్రీరామనవమి రోజునైనా నమస్కరించుకోవాలి.

రఘువంశానికి రత్నం లాంటి వాడు రాముడుఅని రాసాడు వాల్మీకి. ఒకే బాణం ఒకే మాట ఒకే పత్ని అనివైభవంగా వర్ణించాడు వాల్మీకి. మాటంటే మాటే, ఇంక దస్తావేజులు అక్కరలేదు దానికి. రావణాసురుడి తమ్ముడు విభీషణుడు వచ్చి రాముడిని శరణాగతి కోరితే, రావణుడి మరణానంతరం లంకారాజ్యం నీకు ఇచ్చేస్తాను అంటాడు రాముడు. రాముడి సలహాదారులు ఏమన్నారు అంటే ఇప్పడు రావణుడు జీవించే ఉన్నాడు కదా,


ఆయన చేసిన తప్పు సవరించుకొని సీతమ్మని తెచ్చి నీకు అప్పగిస్తే లంకా రాజ్యం వాడికే ఇవ్వాలి కదా. ఆడినమాట తప్పడని రాముడికి ఒక పేరు ఉంది. అప్పుడు ఏ రాజ్యం తెచ్చి ఇస్తావు విభీషణుడికి, అలా తొందరపాటు మాటలు పనికిరావని అన్నారు. ఒకవేళ రావణాసురుడికే కనుక మంచిబుద్ధి కలిగితే అప్పుడు కూడా మాట తప్పే సమస్య లేదు, మనకి వారసత్వంగా వచ్చే అయోధ్య రాజ్యాన్ని విభీషణుడికి ఇచ్చేస్తాను అన్నాడు రాముడు.

రాముడిని లవర్ అఫ్ హ్యూమానిటీ అంటారు మానవజాతిని హృదయపూర్వకంగా ప్రేమించిన వాడు. దేవతల చేత, మనుషుల చేత మాత్రమే కాదు, రాక్షసుల చేత కూడా గౌరవం అందుకున్న వాడు. నేను మాయ లేడి వేషం వెయ్యకపోతే నీ చేతిలో చచ్చిపోతాను మాయ లేడి వేషం వేస్తే ధర్మస్వరూపుడైన రాముడి చేతిలో చచ్చిపోతాను. చావు ఎలాగూ తప్పదు. ఓ రావణాసురుడా నీ చేతిలో చచ్చిపోవటం కంటే ఒక సత్పురుషుడి చేతిలో చచ్చిపోవటం మంచిది కదా అంటాడు రావణుడితో మారీచుడు. ఇవన్నీ రాక్షసుడు చెప్పిన మాటలు.

రాముడికి కౌశల్య మీద ఎంత ప్రేమ ఉందో, ఎంత ఆప్యాయత ఉందో, సుమిత్ర మీద కైక మీద కూడా అంతే ప్రేమ ఆప్యాయత ఉంది. అరణ్యాలకి పొమ్మన్నప్పటికీ కూడా, కైక మీద కాని, మందర మీద కాని కించిత్తు కూడా ద్వేషబుద్ధి కలగలేదు. అది కైక తప్పు కాదు, మందర తప్పుకాదు, నేను అరణ్యవాసం చెయ్యవలసివుంది. అది ఈశ్వర నిర్ణయం కాబట్టి మందరకి కైకకి ఆ బుద్ధి కలిగింది. వాళ్ళు దుర్మార్గులు ఏమీ కాదు, అంతవరకూ రాముడిని ప్రేమించినవాళ్ళే. కైక ప్రారబ్దంలో మందర ప్రారబ్దంలో అగౌరవం భరించవలసి ఉంది కాబట్టి, లోపల ఈశ్వరుడి యొక్క ప్రేరణని అనుసరించి, అది చెడ్డ పని కింద లోకానికి అనిపిస్తున్నప్పటికీ, అక్కడ కూడా నడిపించిన వాడు ఈశ్వరుడే అన్నాడు రాముడు. వాడు దేవుడు!

శ్రీరాముడు పుట్టటమే మనందరికీ కళ్యాణప్రదం లోకకల్యాణం అని శ్రీరామనవమి రోజునే సీతారాములకి కల్యాణం చేస్తారు. మనిషి పవిత్రుడు అవ్వాలి అంటే, బుద్ధి పవిత్రం అవ్వాలి అంటే, వాడికి ఏకాగ్రత రావాలి అంటే, వాడి మనస్సు నిదానంగా ఉండాలి అంటే రామనామాన్ని పట్టుకోవాలి. రైలు పట్టాలని విడిచిపెట్టకుండా ఎలా పరుగెడుతుందో, అలాగే మన జీవితంలో మనం ధర్మాన్ని పట్టుకుని నడవటానికి ఒక రామనామ స్మరణ తప్పించి ఇంకొక మార్గం లేదు. రామనామ స్మరణ చేసుకునేవాడు పవిత్రుడు అవుతాడు. పరమపవిత్రుడు కానివాడికి ఆత్మజ్ఞానం కలగదు. రాముడు అంటే రంజింప చేసేవాడు, రాముడు అంటే జ్ఞాన స్వరూపుడు. మీరు రామనామం చేసుకుంటే రాముడు మనకి ధనం ఇస్తాడు, గుణాన్ని ఇస్తాడు. ఆ ధనాన్ని గుణాన్ని సద్వినియోగం చేసుకుంటే జ్ఞానాన్ని ఇస్తాడు. రాముడు సర్వ సమర్థుడు.

# ఆదిశంకరాచార్యులు వారు



**శ్రీఆదిశంకరాచార్యులు వారి ప్రస్తావన వచ్చినప్పుడల్లా "ది గ్రేట్ ఆచార్య"! అంటూ శ్రీనాన్నగారు శంకరుల పట్ల ప్రేమనీభక్తినీ గౌరవాన్ని ప్రకటించేవారు. శ్రీ శంకరుల గురించి శ్రీనాన్నగారువివిధ సందర్భాలలో చెప్పిన కొన్ని విషయాలు .....**

**- సేకరణ: శ్రీమతి రాజేశ్వరి గారు, హైదరాబాద్**

శంకరాచార్యులు వారు కారణజన్ములు. ఆయన జన్మ స్థలం కేరళలో కాలడి. తల్లి ఆర్యాంబ, తండ్రి శివగురువు. ఆచార్యులవారికి ఐదవ సంవత్సరం వచ్చేనరికి అన్ని విద్యలూ అయిపోయాయి. ఉపనయనం చేసేసారు. ఎనిమిదవ సంవత్సరంలో ఇల్లు విడిచిపెట్టి వెళ్ళిపోయారు. ముప్పైరెండవ సంవత్సరం వచ్చేటప్పటికి ఆయన చేయవలసిన పనంతా చేసేసారు. ఆయన కాలడిలో జన్మించారు, కేదార్ లో అదృశ్యమయ్యారు. ఇదంతా అవతార పురుషుడికే కానీ మామూలు మానవుడికి సాధ్యం కాదు. ఆ పరమేశ్వరుడే గురువు రూపం ధరించి వచ్చాడు.

శంకరుడే ఆదిశంకరాచార్యులుగా జన్మించాడు అని చెపుతారు. ఆదిశంకరులది సాత్విక అవతారం. రాముడిలాగ కృష్ణుడిలాగ రాక్షస సంహారం ఏమీ లేదు. బోధించటం తప్ప రెండో కార్యక్రమం ఏమీ పెట్టుకోలేదు ఆచార్యుడు. ప్రాచీన గ్రంధాలు అన్నీ అధ్యయనం చెయ్యటం, వాటికి వ్యాఖ్యానాలు రాయటం, దేశం అంతా తిరిగి బోధించటం. ఒకే వ్యక్తిలో జ్ఞానం, యోగం, భక్తి, శక్తి అన్నీ ఉన్నాయి. ఆయన గొప్పజ్ఞాని, భక్తుడు, కర్మయోగి, పండితుడు, కవి, రచయిత. మూడు సార్లు భారత దేశం అంతా తిరిగి బోధించారు.

ఆచార్యులువారు ఇజ్ ఎ మాన్ ఆఫ్ కంపాషన్. ఆయన దయాస్వరూపుడు, సర్వసాధారణంగా ఏ యోగీ కంపాషన్ లేకుండా ఉండడు. ఆయనకి యోగశక్తి ఉంది. తన ఐదవ ఏటనే యోగిక్ పవర్స్ కొన్ని చూపించాడు. విద్యార్థి దశలో కొంతకాలం బిక్ష చేసుకున్నాడు అహంకారం నశించటానికి. బిక్ష అడిగితే అందరూ తలోమాట అంటారు, తిడతారు, అప్పుడు మనస్సులో వికారాలు ఉన్నాయో లేదో చూసుకోవటానికి అదొక శిక్షణ. ఒక ఇంటికి బిక్షకి వెళ్ళాడు, వాళ్ళు పేదవారు. ఆ ఇల్లాలు ఏదో ఒకటి ఇద్దామని కంగారుగా ఇల్లంతా తిరుగుతోంది. అది చూస్తున్నారు శంకరులు. ఒక పాత ఉసిరికాయ దొరికితే, అది ఆచార్యులువారి గిన్నెలో వేసింది. అప్పుడు ఆయన లక్ష్మీదేవిని ప్రార్ధిస్తూ కనకధారా స్తోత్రం చెప్పాడు. పూర్వం వీళ్ళు ఎవరికీ ఏమీ పెట్టలేదు, అందుచేత ఈ అమ్మగారికి ఏమీ

ఇవ్వటానికి అవకాశం లేదు అని లక్ష్మీదేవి చెప్పింది. అప్పుడు శంకరులు, నువ్వు చెప్పింది నిజమే, కాని ఇప్పుడు నాకు ఉసిరికాయ ఇచ్చింది కదా, అది వొంపు పెట్టుకొని వాళ్ళని అనుగ్రహించు అన్నారు. అప్పుడు లక్ష్మీదేవి బంగారు ఉసిరికాయలు వర్షం కురిపించింది. నువ్వు చిన్న పనులు చెయ్యి, అది వంపుపెట్టుకొని నిన్ను అనుగ్రహిస్తాను అంటాడు గురువు. గురువు అనుగ్రహానికి అసాధ్యం అంటూ ఏమీ లేదు అనడానికి ఈ సంఘటన ఒక నిదర్శనం.

ఎనిమిదవ సంవత్సరంలో ఇంటిదగ్గర పని అయిపోయింది అని,సన్యాసం పుచ్చుకోవటానికి తల్లిని అనుమతి అడిగాడు. నాకు నువ్వు ఒక్కడివే కుమారుడవు, నీ చేత్తో నన్ను పంపేయి, తరువాత నీ ఇష్టం అనిఆవిడ ఒప్పుకోలేదు. తల్లి అనుమతి లేకుండా సన్యాసం తీసుకోవటం క్షేమం కాదు. నదిలో ఒక మొసలి తన కాలు పట్టుకున్నట్టుగా చూపించి, సన్యాసం తీసుకుంటే మొసలి వదిలేస్తుంది అని తల్లికి చెప్పాడు. ఆవిడ నిజం అనుకొని, సన్యాసం తీసుకున్నా బ్రతికుంటే చాలు అని సన్యాసానికి ఒప్పుకుంది. ఆచార్యులువారునేను సన్యాసిని అయిపోయాను, ఇంక ఇంటికి రాకూడదు అన్నారు. కాని నా ప్రాణ ప్రయాణ సమయంలోవచ్చి నీ చేత్తో నన్ను పంపు అని తల్లి అడిగింది. సన్యాస ఆశ్రమ ధర్మానికి విరుద్ధమైనా, నేను నీ చివరికాలంలో, చివరిశ్వాసలో కాలడి వస్తాను అని తల్లికి మాట ఇచ్చారు.

అలాగే ఆవిడ అవసానదశలో ఉండగా శంకరులు శృంగేరిలో ఉన్నారు. దివ్యదృష్టితో తల్లి అవసానదశలోఉందని చూసారు. కాలడి వచ్చి తల్లికి బ్రహ్మము గురించి చెప్పటం మొదలుపెట్టారు. అల్టిమేట్ట్రూత్ బ్రహ్మమే. దేవతలనూ, అవతారపురుషులనూ, సామాన్య జీవకోటినీ కల్పించినది బ్రహ్మమే. వీళ్ళందరూ బ్రహ్మములోనే కల్పించబడ్డారు. బ్రహ్మము ఒక్కటే సత్యము. కనిపించేవి అన్నీ మిధ్య. ఉపనిషత్తులలో బ్రహ్మము గురించి ఎక్కువ చెప్పారు. అది నిర్గుణం, నిరాకారం. అది మంచిది చెడ్డది అనటానికి వీలు లేదు. అక్కడకు మనస్సు బుద్ధి వెళ్ళవు. ఇంద్రియాలకు కనపడదు. కేవలం అనుభవైకవేద్యం అని బ్రహ్మము గురించి చెప్పసాగారు. తల్లి బ్రహ్మమును అందుకోలేక పోతోంది. నువ్వు ఏదో చెపుతున్నావు నాకు అందటం లేదు అంది.

అది అందుకోవాలంటే కొంచెం ఎవాల్వ్‌డ్ సోల్ అయ్యి ఉండాలి. అప్పటిదాకా ఆవిడ సాకారాన్ని ఆరాదిస్తోంది. విష్ణువుని ఆరాధిస్తోంది. సాకారాన్ని (రూపము, గుణము) ఆరాధించటం తేలిక. నిర్గుణాన్ని నిరాకారాన్ని ఆరాధించటం కష్టం అది సత్యమైనా. అప్పుడు శంకరాచార్యులు మహావిష్ణువుని ప్రార్థించి,మహావిష్ణువుని దర్శింప చేసారు. ఆవిడ రోజూ కృష్ణుడి రూపాన్ని ప్రీతిగా పూజించేది. ఆ రూపం కనిపించగానే సడన్ గా ఆ రూపం మీద మనస్సు ఆగిపోయింది. అంటేజీవితం పొడుగునా ఏ రూపాన్ని అయితే ఆరాధిస్తోందో, ఏ

సగుణాన్ని అయితే ఆరాధిస్తోందో, సడన్ గా మనస్సు ఆ రూపం మీద, ఆ గుణాలమీద, ఆ మహావిష్ణువు లక్షణాల మీద ఆగిపోయింది. చివరి శ్వాసలో నన్ను స్మరిస్తూ, నా రూపాన్ని ధ్యానిస్తూ నువ్వు ప్రాణం విడిచిపెడితే, నీ మనస్సు నాలో ఐక్యం అవుతుంది అని పరమాత్మ గీతలో చెప్పాడు. భగవంతుడికి అసలు రూపం లేదు. రూపం లేని భగవంతుడిని మనం పట్టుకోలేము. ఎంచేతంటే మనం రూప ధారులం. ఏదో శరీరం తోటి, ఏదో కులం తోటి, జాతి తోటి, ఏదో రూపం తోటి తాదాప్యం పొందుతున్నాము కదా. అంచేత రూపం లేని దేవుడిని పట్టుకోలేము. శంకరుడి తల్లిది కూడా అదే పరిస్థితి. అప్పుడు శంకరుడు మహావిష్ణువును ప్రార్థించి, ఆ రూపాన్ని తల్లి ధ్యానించేలా చేసి, ఆ రూపం మీద తల్లి మనస్సు నిలబడేలా చేసి, ఆమె నారాయణుడిలో ఐక్యం అయ్యేలాగ చేసాడు.

తల్లి దహన సంస్కారాలు సన్యాసివైన నీవు చేయరాదు అన్నారు బంధువులు. అప్పుడు శంకరుడు వాళ్ళని ఎదిరించి, ఎవరూ నిప్పు పుల్లలు ఇవ్వకపోయినా, శవాన్ని మోయటానికి ఎవరూ ముందుకు రాకపోయినా, తల్లికి ఇచ్చిన మాట ప్రకారం తల్లి శవాన్ని మోసుకొని వెళ్ళి, ఇంటి ఆవరణలోనే అరటి బోదెలు పేర్చి, యోగాన్ని రగిల్చి, దహన సంస్కారాలు ముగించారు. భగవంతుడికి సహాయం చేసే అవకాశం వచ్చినా, గ్రహించలేని మూఢులు ఆ బంధువులు. తిరిగి జీవితకాలంలో మళ్ళీ కాలడి గ్రామంలో ఆచార్యులువారు అడుగు పెట్టలేదు.

శంకరుల గురువు గోవింద భగవత్పాదులు మధ్యప్రదేశ్ లో నర్మదానది ఒడ్డున ఒక గుహలో ధ్యానం చేసుకునేవారు. శంకరులు ఆయన దగ్గరికి వెళ్ళినప్పుడు ఎవరు మీరు అని అడిగారు. దానికి ఆదిశంకరులు,నేను అదీ కాదు, ఇదీ కాదు, ఏదైతే చైతన్యమో అదే నేనై ఉన్నాను అన్నారు. చైతన్యం ఆకాశంలాగా అంతటా వ్యాపించి ఉంటుంది. అంతటా వ్యాపించిన ఆ వస్తువే నేను అన్నాడు.

గోవింద భగవత్పాదులు శంకరాచార్యుల వారి ఔన్నత్యం గుర్తించి కాశీ వెళ్ళమన్నారు. అక్కడ మహాపండితులు ఉన్నారు. కాని హిందూమతంలో, విష్ణువే దేవుడని, శివుడొక్కడే దేవుడని, అమ్మవారు ఒక్కరే దేవుడని ఇలా పేచీలు పెట్టుకొంటున్నారు, ఐకమత్యం లేదు. నువ్వు అద్వైత మతం స్థాపించు. ఉన్నది ఒక్కటంటే ఒక్కటే, అదే బ్రహ్మము, అదే ఆత్మ. ఆత్మరెండు కాదు, అది అద్వైతమే అనేసిద్ధాంతాన్ని బోధించు అన్నారు గోవింద భగవత్పాదులు.

కాశీలో విశ్వేశ్వరుడిని దర్శించారు శంకరులు. ఆయనకు కాశీ అంటే బహుప్రీతి. అంతటా ఉన్న నిన్ను ఇక్కడే ఉన్నావు అన్నట్టు నిన్ను చూడటానికి కాశీ వచ్చాను. ఒక గుళ్ళో లింగానికి పరిమితం చేస్తున్నాను. ఈ తప్పుకు క్షమించి ఆశీర్వదించు తండ్రీ అని కాశీ విశ్వేశ్వరుడిని ప్రార్థించాడు.

శంకరులు బ్రాహ్మణకులంలో జన్మించారు, కొంచెం ఆచారాలు ఉన్నాయి. ఈయనపెద్ద

ఆచార్యుడు అవ్వబోతున్నాడు, ఈయనకి కులం పట్టింపు ఉండకూడదని, ఆచార్యులవారు గంగానదిలో మణికర్ణికా ఘాట్ వద్ద స్నానం చేసి వస్తుండగా, విశ్వేశ్వరుడు చండాలుడు వేషంలో ఎదురు వచ్చాడు. శంకరులు దూరంగాపో అన్నారు. అప్పుడా చండాలుడు ఏది పోవాలి, రెండు శరీరాలు పంచభూతాలతోటే చేసారు. నీ శరీరంలో ఏముందో నా శరీరంలోనీ అదే ఉంది. లోపలఉన్న వస్తువు ఇద్దరిలోనీ ఒక్కటే. దూరంగా పొమ్మంటున్నావు, కాని లోపలిది ఎక్కడికి పోగలదు అన్నాడు. వచ్చినవాడు సామాన్యుడు కాదని గ్రహించి సాష్టాంగ నమస్కారం చేసి మనీష పంచకం చెప్పాడు. అందులో గొప్ప ఫిలాసఫీ ఉంది.

కాశీ విశేశ్వరుడిని ప్రార్థిస్తూ, ఓ శంకరా, నువ్వుఎలాగూ బిక్షకు వెళ్తావు కదా, నీతో పాటు నా మనస్సు అనే కోతిని కూడా తీసుకెళ్ళు. బిక్షకులు కోతిని తాడుకట్టి కూడా తీసుకొని వెళ్తారు కదా. అలాగే నా మనస్సు అనే కోతిని నీ కూడా బిక్షకు తీసుకొని వెడితే, నీకు ఎక్కువ బిక్ష దొరుకుతుంది ఓ శంకరా! కోతిని చూడటానికి వచ్చి బిక్ష వేస్తారు, నాకు నా మనస్సు పీడ వదులుతుంది. అది నీ నుంచి దూరంగా వెళ్ళకుండా, నీ సన్నిధిలో పడి ఉంటుంది. అది నాకు కలిగే లాభం. ఇద్దరికీ లాభమే, నా మనస్సును నీకూడా తీసుకొనిపో అని ఆచార్యులు వారు ప్రార్థించి చూపించారు.

గురువు దయకు అసాధ్యం ఏమీ లేదు. ఒకసారి ఆచార్యులు వారు పాఠం మొదలు పెట్టటానికి తోటకాచార్యులు కోసం ఎదురు చూస్తున్నారు. మిగిలిన శిష్యులు మీరు పాఠం మొదలు పెట్టేయండి, వాడికి తెలివితేటలు లేవు, శాస్త్రార్థాన్ని గ్రహించలేదు. ఏదో పని చేస్తూ ఉంటాడు, తరువాత వచ్చి కలుస్తాడు, అంటూ తేలిక చేసి మాట్లాడారు. దానితో గురువుగారి హృదయం ద్రవించింది. దయతో తోటకాచార్యుని పిలిచారు. ఆయనలో పాండిత్యం తనకు తానుగా పుట్టింది. తోటకాష్టకం ఆశువుగా చదువుతూ ఆచార్యులువారి దగ్గరకి వచ్చాడు. గురువు దయవలన కూడా విద్య వస్తుంది. తపస్సు వలన విద్య వస్తుంది. తనకు తానుగా వివేకం తెలివితేటలతో శాస్త్రాన్ని స్వాధ్యయనం చేయటం వలన కూడా విద్య వస్తుంది

దేశం నలుమూలలా నాలుగు మఠాలు స్థాపించి నలుగురు శిష్యులనూ ధర్మాన్ని బోధించమని చెప్పారు. శృంగేరిలో మొదటి మఠం స్థాపించి, తరువాత బదరీలో, పూరీలో, ద్వారకలోనూ స్థాపించారు. అన్నం, బట్ట కావాలంటే ప్రజల మీద ఆధారపడండి కాని టీచింగ్ విడిచిపెట్టవద్దు అని చెప్పారు. సన్యాసులు సబ్జెక్టు బాగా స్టడీ చెయ్యాలి, అది ఆచరించాలి, తరువాత ఇతరులకు అర్థం అయ్యేలా బోధించాలి.

చైతన్యము అంతటా వ్యాపించి ఉంది, అదే వాసుదేవుడు. సూర్యుడిని చూడటానికి లైటు అక్కరలేదు అలాగే చైతన్యం ఉంది అని చెప్పటానికి ఇంకొకటి సహాయం అక్కరలేదు. అది ఉండటం వలననే అది తెలియబడుతుంది అని బోధించిన ప్రధమ ఆచార్యుడు

ఆదిశంకరులు.

ఆదిశంకరులది అద్వైతతత్వం. సముద్రంలో ఉన్నదీ నీరే, అలలో ఉన్నదీ నీరే. విడివిడిగా కనిపిస్తున్నా, ఉన్నది నీరే. అలాగే జీవుడు భిన్నంగా కనిపిస్తున్నా, అది కూడా బ్రహ్మమే. ఉన్నది ఒక్కటే అన్నారు. ఈ శరీరానికి, మనస్సుకి, బుద్ధికి అతీతంగా నేను ఉన్నాను అనే అనుభవం సంపాదించు అన్నారు ఆచార్యులు వారు. శరీరం పోయాక కూడా నేను ఉన్నాను అనే అనుభవం రాకుండా నీకు మోక్షం రాదు. అమృతానుభవం కలగదు.

నీకూడా నీడ వస్తుంది. ఆ నీడని చూస్తున్నప్పుడు ఆ నీడ నేను అనే భావన నీకు రాదు. అలాగే అద్దంలో నీ ప్రతిబింబాన్ని చూసినప్పుడు, ఆ ప్రతిబింబం నేను అని నీకు అనిపించదు. అలాగే నీ దేహాన్ని చూసినప్పుడు కూడా, ఈ దేహం నేను అని నీకు అనిపించకూడదు, అప్పుడు మోక్షం వస్తుంది అన్నారు.

బ్రహ్మము సత్యము,జగత్తు మిధ్య అన్నారు ఆచార్యులువారు. జగత్తు నామరూపాలుగా మిధ్య, బ్రహ్మముగా సత్యమే. నీ కళ్లకు కనిపించే ప్రపంచము కూడా బ్రహ్మమే. నీ బుద్ధి నామరూపాలకు పరిమితం అవ్వటం వల్ల అది జగత్తుగా కనిపిస్తోంది.

సూర్యుడు ఎంత పెద్దవాడైనా, మేఘాలు కనబడకుండా చేసేస్తాయి. అలాగే మన బుద్ధిలో దోషాలు, లోపలఉన్న జ్ఞానసూర్యుడు మనకు కనిపించకుండా చేసేస్తాయి, ఆయన అనుభవంలోకి రాకుండా బుద్ధిలోని బలహీనతలు అడ్డుపడతాయి అని చెప్పారు.

సముద్రంలో కెరటాలు బుడగలు వస్తూ ఉంటాయి. మళ్ళీ సముద్రంలో ఐక్యం అయిపోతూ ఉంటాయి. సృష్టి అనే తెరమీదకు జీవకోటి వచ్చి సృష్టిలోనే కలిసిపోతూ ఉంటారు. ఏదో ఒక పీడ, జీవుడిని పీడిస్తూనే ఉంటుంది. కర్మనూ, పరిస్థితులనూ జీవుడు మార్చుకోలేడు, కాని మనస్సును మార్చుకోగలడు. మనస్సుని భగవంతుడికి అర్పిస్తే, భగవంతుని స్మరణలో జీవించటం నేర్చుకుంటే ప్రారబ్ధాన్ని ఏక్సెప్ట్ చేసేటట్టుగా మనస్సును మార్చుకోవచ్చును. ఆ కీలకం అర్థం అయితే, దుఃఖం కూడా నిన్ను స్పర్శించలేదు అన్నారు ఆచార్యులువారు.

మనిషి తన పూర్వజన్మల సంస్కారం ప్రకారం కర్మమార్గంలోప్రయాణం చేసినా, భక్తిమార్గంలోప్రయాణం చేసినా,యోగమార్గంలోప్రయాణం చేసినా, ఏమార్గంలోప్రయాణం చేసినా,జ్ఞానమార్గం దగ్గరికి రావలసిందే. జ్ఞానంతో సమానమైనది వేరే ఏదీ లేదు. మనం ఆత్మజ్ఞానం సంపాదించాలి, అదే గమ్యం.

ఓపికఉన్నంత వరకూ పనిచేసుకోండి. పని లేని జీవితం కూడా ఒక జీవితమా! సోమరితనంగా ఉండవద్దు, ఫలితాన్ని ఆశించకుండా పని చేసుకోండి. పని అంటే అజ్ఞానం ప్రేరణతో చేసే పని కాదు. భగవంతుని దయ కోసం చేసే పని అని అర్థం. అలా పనిచేయటం

వలన మీరు పవిత్రతను పొందుతారు. మీకున్న విశేషతను వీలైతేపదిమందికి పంచిపెట్టండి. పని బద్ధకస్తులు కాకండి. పలితం మీద ఆసక్తి లేకుండా పని చేసుకోండి. భగవంతుని దయకు పాత్రులు కండి అన్నారు ఆచార్యులు వారు.

గీతలో ఒక శ్లోకం అయినా నేర్చుకోండి, ఒక బిందువైనా గంగాజలం త్రాగండి, మీకు ఏదైనా కలిగి ఉంటే సహాయం చెయ్యండి అని చెప్పారు శంకరులు. విష్ణుసహస్రనామాలు పారాయణం చేయమన్నారు.

పవిత్రత ఏకాగ్రత ఉండాలి. ప్యూరిటి, కాన్సంట్రేషన్ తో పాటు డిటాచ్మెంట్ (వైరాగ్యం)కూడా ఉండాలి. కోరికని బట్టి ఏదీ రాదు, నువ్వు అర్హత సంపాదించాలి, నీకు చిత్తశుద్ధి రావాలి అన్నారు ఆచార్యులు వారు. జ్ఞానం రాకుండా మోక్షం రాదు.

నీ ప్రతిబింబం కనబడాలంటే అద్దం శుభ్రంగా ఉంటే చాలదు. అద్దం కదలకుండా ఉండాలి. నీ మనస్సు, పవిత్రంగా నిష్కల్మషంగా ఉంటే చాలదు, అది వాండరింగ్ లేకుండా ఉండాలి. అప్పుడే పరమాత్మ స్పష్టంగా వ్యక్తమవుతాడు అన్నారు అచార్యులు వారు.

సత్‌సాంగత్యం వల్ల నిస్సంగత్వం కలుగుతుంది. దాని వల్ల బుద్ధికి మోహం పోతుంది. ఉన్నదానిని లేదు అనుకోవటం, లేనిదానినిఉంది అనుకోవటం మోహం. సత్య-అసత్య, నిత్య-అనిత్య వివేకం కలుగుతుంది. దానితో బుద్ధికి ఉన్న చపలత్వం పోయి నిశ్చలత్వం అలవాటు అవుతుంది. ఆ నిశ్చలత్వం జీవన్ముక్తికి దారి తీస్తుంది అన్నారు ఆచార్యులు వారు.

కేదార్‌లో శరీరం అదృశ్యం చేసే ముందర ఆచార్యులువారు శిష్యులతో కరుణారస పూరితమైన దృక్కులతో ఏమైనా సందేహాలు ఉంటే అడగండి అన్నారు. సాధకులు ముఖ్యంగా పాటించవలసినవి ఏమిటి అని శిష్యులు అడిగారు. దానికిఆచార్యులువారుచెప్పారు - 1) ధర్మ జీవనం, అంటే గీతలో చెప్పినట్టు చేయాలి, వద్దన్నవి వదిలిపెట్టేయాలి. వాదవివాదాలు చేయకుండా, ఎందుకు అని ప్రశ్నించకుండా సాగించాలి. 2) నీకున్న విశేషతను పదిమందికి పంచాలి. 3) కనీసం సంవత్సరానికి పది రోజులైనా నీకు ఇష్టమైన పుణ్యక్షేత్రంలో నివశించాలి. అప్పుడు నీ మనస్సుఎక్కువగా దేని మీద వాలుతోందో గమనించుకొని, ఆ బలహీనతను తగ్గించుకోవటానికి ప్రయత్నం చేసి దానిని తొలగించమని ఈశ్వరుడిని ప్రార్థించాలి.

ఆచార్యులువారు శరీరం అదృశ్యం చేసే ముందర శిష్యులతో మీరుపెట్టిన అన్నానికి, మీరు ఇచ్చిన బట్టలకూ కృతజ్ఞతలు నాయనా అన్నారు. దానికి పద్మపాదుడు కన్నీరు మున్నీరుగా దుఃఖిస్తూ, గురుదేవా మేము పెట్టిన అన్నానికి, బట్టలకి కృతజ్ఞతలు చెపుతున్నారు. విలువ కట్టలేని ఆత్మవిద్యను బోధించి, అనుగ్రహించిన మీకు మేము ఏ రీతిగా కృతజ్ఞతలు చెప్పుకోవాలి తండ్రీ అన్నాడు. .

**హర హర శంకర జయ జయ శంకర**



ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 30 డిసెంబర్ 1984, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఆచార్యులవారు బ్రహ్మ వస్తువు, సత్య వస్తువు అని చెబుతున్నారు. అసలు మనం శరీరం దాటి మనసు దగ్గరకే వెళ్ళలేదు మన జీవితాలు. మనకి ఫిజికల్ లైఫ్ ఉంది కాని మెంటల్ లైఫ్ లేదు. శారీరక జీవితం ఉంది, మానసిక జీవితం లేనట్టే లెక్క! అసలు మానసిక జీవితమే లేని వాడికి బ్రహ్మపదార్థం ఏమిటి? ఆత్మపదార్థం ఏమిటి? సత్యవస్తువు ఏమిటి? అటుకులు మనిషి నోట్లో వేసుకుంటే వాటి రుచి తెలుస్తుంది కాని, దున్నపోతు నోట్లో వేస్తే అటుకుల రుచి ఏం తెలుస్తుంది? క్షీరాన్నం రుచిగా ఉందంటే నోట్లో వేసుకుంటే తెలుస్తుంది, ముక్కులో వేసుకుంటే ఏం తెలుస్తుంది? అర్హత ఉన్నవాడికి, యోగ్యత ఉన్నవాడికి, ఆచార్యులు వారు చెప్పిన మాటలు, విషయం, దాని విలువ, దాని బరువు, దాని లోతు తెలుస్తుంది గాని, మామూలుగా పైపైన జీవితం జీవించేవాడికి తెలియదు. ఈ శరీరం కనిపిస్తోంది చూడండి ఇది స్థూలశరీరం, భౌతికశరీరం. దీన్ని ఇంగ్లీష్ లో ఫిజికల్ బాడీ అంటాము. ఈ శరీరమే మనకి తల్లి కడుపులోనుండి బయటకి వచ్చింది. ఈ శరీరం పెరుగుతుంది, ఈ శరీరం ముసలిది అవుతుంది, ఇది మాంసమయం, రక్తమయం, ఈ శరీరమే ఆరోగ్యంగా ఉంటుంది, ఈ శరీరానికే అనారోగ్యం వస్తుంది, ఈ శరీరమే పడిపోతుంది, పడిపోయినపుడు దీనిని తీసుకెళ్ళి దహనం చేస్తారు. ఇది ఫిజికల్ బాడీ. ఆచార్యులవారు ఎక్కడున్నారు? మనం ఎక్కడున్నాము? ఎక్కడో ఆధ్యాత్మిక విద్య, బ్రహ్మ పదార్థం అంటున్నారు. మనమేమో ఈ శరీరాన్నే దాటలేదు. పోనీ మానసిక జీవితం, మనస్సు అనేది ఒకటి ఉందని ఒప్పుకుంటున్నారా లేదా మీరు?

దేవుడి విషయం, బ్రహ్మపదార్థం విషయం వదిలేయండి. మనస్సనేది ఒకటుందని మీకు తెలుసు కదా, ఈ మనస్సుని మెంటల్ బాడీ అంటాము. ఈ శరీరం లోపల ఇంకొక శరీరం ఉంది మనకి, ఆ లోపల ఉన్న శరీరాన్ని మెంటల్ బాడీ అంటాము. అంటే ఏంటి? స్థూలశరీరంలో ఏమో మాంసం, రక్తం, ఎముకలు, ఉంటాయి. లోపల శరీరంలో ఏముంటాయి? వారంటే మాకు ఇష్టం లేదు, వీరంటే చాలా ఇష్టం. ఇలా ఇష్టాలు-అయిష్టాలు, కోపాలు-తాపాలు, రాగ-ద్వేషాలు, ఇవన్నీ కలిపి లోపల ఒక శరీరం కింద తయారవుతుంది. దానిని ఇంగ్లీషులో మెంటల్ బాడీ అంటారు. అంటే మానసిక శరీరం. దానిని వేదాంత పరిభాషలో సూక్ష్మశరీరం అంటారు. ఇదేమో స్థూలశరీరం, లోపల ఉన్నది సూక్ష్మశరీరం. అది కూడా శరీరమే రాగ ద్వేషాలతో కూడినటువంటి శరీరం.

ఆచార్యులవారు ఏమి చెబుతున్నారు? బ్రహ్మపదార్థం గురించి చెబుతున్నారు. బ్రహ్మపదార్థం గురించి చెప్పటానికి, అక్కడిదాకా వెళ్ళటానికి, అసలు మనం ఈ స్థూలశరీరం దాటి సూక్ష్మశరీరం దగ్గరకి కూడా వెళ్ళలేదు. కొంతమంది మనుషులు పుట్టాక, పెరిగి, పెద్దవారై, మరణించే వరకు కూడా, ఈ స్థూల శరీరమే గాని, సూక్ష్మశరీరం గురించి కూడా వాడికి తెలియదు. అసలు సూక్ష్మశరీరం ఎలా ఉంటుందో, మానసికజీవితం ఎలా ఉంటుందో, దాని లోతులు ఎలా ఉంటాయో, దాని అందాలు ఎలా ఉంటాయో, ఎప్పుడూ కూడా టచ్ చెయ్యకుండానే చచ్చిపోతారు. అసలు మానసిక జీవితం లేని వాడికి ఆధ్యాత్మిక జీవితం లేదు, పరమాత్మను తెలుసుకునే సమస్యే లేదు. మెంటల్ లైఫ్ కావాలి దీనికి, మనలో మెంటల్ లైఫ్ ఉన్న వాళ్ళు ఎంతమంది ఉన్నారు? మనుషులకే కాదు జంతువులకి కూడా ఫిజికల్ లైఫ్ ఉంది. అవి ఆలోచించలేక పోవచ్చు కాని ఫిజికల్ లైఫ్ ఉంది. ఈ పని మంచి, ఈ పని చెడు అని ఆలోచించి ఒక పని చేయలేకపోవచ్చు జంతువు. కాని మనిషికి ఆలోచించగల శక్తి ఉంది. ఆలోచించగల శక్తి లేనప్పుడు మెంటల్ లైఫ్ లేదన్నమాట, మెంటల్ లైఫ్ లేనపుడు జంతువుతో సమానం.

మానసికజీవితం లేనివాడికి ఆధ్యాత్మికజీవితం రానే రాదు. అయితే మానసిక జీవితం ఎలా ఉంటుందో మీరు ఎప్పుడైనా చూసారా? ఆ మానసిక శరీరాన్ని బాగు చేసుకోడానికి ఎప్పుడైనా ప్రయత్నం చేసారా? స్థూల శరీరంలో మనకేమైనా రోగం వస్తే డాక్టర్ దగ్గరకి వెళ్తున్నాం, మందేసుకుంటున్నాం, వాడుతున్నాం, తగ్గించుకుంటున్నాం, అయితే సూక్ష్మశరీరానికి రోగమొస్తే, అది పాడైపోతే, దానికేమైనా మీరు మందులు వాడుతున్నారా? బాగుచేసుకోడానికి కృషి చేస్తున్నారా? అసలు మానసికశరీరం ఒకటి ఉందని తెలియనపుడు దానిని ఏమి

బాగుచేసుకుంటాం? దాని ఆరోగ్యం కోసం ఏమి ఆలోచిస్తాం? అసలు వస్తువు ఉందనే మనకి తెలియడం లేదు కదా. ఈ స్థూలశరీరం ఎలా ఉందో, మనకి లోపల మనస్సు అనేది ఒకటుందని తెలిస్తే కదా, ఆరోగ్యంగా ఉందో, అనారోగ్యంగా ఉందో అసలు పరిశీలన చేసుకోడానికి. ఇది బెజవాడ జంక్షన్ లాంటిది మానవ శరీరం. బెజవాడ జంక్షన్ ఎటువంటిదంటే మీరు కలకత్తా వెళ్ళాలంటే, కలకత్తా వెళ్ళచ్చు. ఢిల్లీ వెళ్ళాలంటే ఢిల్లీ వెళ్ళచ్చు. మదరాసు పోవాలంటే మదరాసు పోవచ్చు. పాలకొల్లు రావాలంటే పాలకొల్లు రావచ్చు. బెజవాడ జంక్షన్ లాంటిది మానవ శరీరం కూడా, ఈ మానవశరీరం జంక్షన్ నుండి పైలోకాలకు వెళ్ళచ్చు, కింద లోకాలకు వెళ్ళచ్చు. మంచి లోకాలకు వెళ్ళచ్చు, చెడ్డ లోకాలకు వెళ్ళచ్చు. మంచి పనులు చేయచ్చు, చెడ్డ పనులు చేయచ్చు. సాక్షాత్తూ మానవశరీరం నుండి మోక్షం కూడా పొందచ్చు. ఇలా కర్మ చేసి మోక్షం పొందే అధికారం మనిషికి ఉంది, కాని ఈ అవకాశం పశువుకి మాత్రం లేదు.

మనకి ఆలోచించే శక్తిని ఇచ్చాడు. ఆలోచించే శక్తి మనకు ఇచ్చాడు కాబట్టి, దానిని విడదీసుకునే వివేకం, ఆ డిస్క్రిమినేషన్ చాలా అవసరం. జంతువు కంటే మనకి ఎక్కువగా ఉన్నది ఏంటంటే ఆలోచించే శక్తి. మానసికశరీరాన్ని మనం శుద్ధి చేసుకోవాలి. దాని ఆరోగ్యం చెడిపోయింది. స్థూలశరీరం కొంత వరకు ఆరోగ్యంగా ఉంది కాని, మానసికశరీరం ఆరోగ్యం పూర్తిగా చెడిపోయింది. మానసికశరీరం ఎవరికైతే ఆరోగ్యంగా లేదో, ఎవరికైతే శుద్ధిగా లేదో, ఎవరికైతే బాగుగా లేదో, మనస్సు ఎవరికైతే కుదురుగా లేదో, వాడికి జ్ఞానం రాదు. మనసు స్వచ్ఛంగా ఉండాలి, శుద్ధిగా ఉండాలి, నిర్మలంగా ఉండాలి, ఏకాగ్రంగా ఉండాలి, పవిత్రంగా ఉండాలి. అటువంటి పవిత్ర మనసు, ఏకాగ్రమైన మనసు జ్ఞానం అనే గమ్యానికి దారి చూపిస్తుంది గాని, లేకపోతే జ్ఞానం అనే గమ్యానికి దారి తెలియదు.

అందుచేత కృష్ణుడు ఏమన్నాడంటే నీ మనస్సే నీ శత్రువు, నీ మనస్సే నీ మిత్రుడు అన్నాడు. అంటే నీ మనస్సు ఆరోగ్యంగా ఉంటే నీకు మిత్రుడు లాంటిది. నీ మనసు అనారోగ్యంగా ఉంటే ఎవరో ఎదుటివారు నీకు అపకారం చెయ్యక్కర్లేదు, నీ మనస్సే నీకు అపకారం చేస్తుంది కాబట్టి నీ మనస్సు నీకు శత్రువు అన్నాడు. నా మనస్సును ఆరోగ్యంగా ఉంచుకుంటే నాకు ఉపకారం చేస్తుంది. నా మనస్సును అనారోగ్యంగా ఉంచుకుంటే నాకు అపకారం చేస్తుంది. అందుచేత నా మనస్సే నాకు శత్రువు, నా మనస్సే నాకు మిత్రుడు. నా మనస్సు సరిగ్గా లేదనుకోండి, మీరందరూ కలిసి నాకు ఉపకారం చెయ్యాలన్నా చెయ్యలేరు. నా మనస్సు బాగాలేదు అనుకోండి, నా శరీరం ఎంత ఆరోగ్యంగా ఉంటే ఏం లాభం?

డబ్బు లేనివాడు బ్రతకగలడు, చదువు లేనివాడు బ్రతకగలడు కాని, మనస్సు సరిగా లేకపోతే బుద్ధిభ్రష్టుడు కనుక అయితే, వాడు అన్నివిధాలా పతనం అయ్యిపోతాడు. అందుచేత బుద్ధి చాలా ప్రధానం. ఈ బుద్దే మనకి దారి చూపుతుంది. ఈ బుద్ధిని మనం సరిచేసుకోవాలి. ఈ స్థూలశరీరాన్ని నడిపేది మెంటల్ బాడి. అసలు మానసిక జీవితం ఎలా ఉంటుందో, దాని స్వచ్ఛత ఎలా ఉంటాయో, దాని లోతులు ఎలా ఉంటాయో, ఎప్పుడైనా జీవించి ఉంటే కదా మనం! అసలు మానసిక జీవితం ఎలా ఉంటుందో మీరు ఎప్పుడైనా జీవించారా? ఒకటి జ్ఞాపకం ఉంచుకోండి. మానసిక ఆరోగ్యం కోసం ఈ స్థూలశరీరాన్ని విడిచి పెట్టేసినా ఫరవాలేదు. దీని ఆరోగ్యం కంటే దాని ఆరోగ్యం ముఖ్యం. ఎందుచేతనంటే, ఈ స్థూలశరీరానికి వంద రోగాలున్నాయనుకోండి మాటవరసకి, ఈ వంద రోగాలు కూడా మళ్ళీ జన్మలోకి ఒక్క రోగము రాదు. స్మశానంలో కాలిపోతాయి. నాకిప్పుడు షుగర్ కంప్లైంట్ ఉందనుకోండి, బ్లడ్ ప్రెషర్ ఉందనుకోండి, ఇలా వంద రోగాలు ఉన్నాయి అనుకోండి, ఈ శరీరం కాలినప్పుడు ఈ శరీరంలోని వంద రోగాలు కూడా కాలిపోతాయి. కాని మనసుని సూక్ష్మశరీరం అంటున్నాం కదా, దానికి ఉన్న రోగాలు మట్టుకు స్మశానంలో కాలవు. స్థూలశరీరంలో ఉన్న రోగం కాలిపోతుంది. సూక్ష్మశరీరంలో ఉన్న రోగం కాలదు. ఆ రోగం ఏమి చేస్తుంది? మళ్ళీ జన్మలో కూడా వస్తుంది. అంటే స్థూలశరీరం యొక్క ఆరోగ్యం కంటే, మానసిక శరీరం యొక్క ఆరోగ్యాన్ని ఎవరైతే ప్రధానంగా చూసుకుంటున్నారో, వారికి పరబ్రహ్మ తత్వానికి దారి కనిపిస్తుంది. ఎవడైతే శుచిగా ఉంటున్నాడో బుద్ధి విషయంలో వాడే పవిత్రుడిగా ఉండగలడు.

ఈ మధ్యన నేను సూళ్ళూరుపేట వెళుతుంటే ఒక గుండెజబ్బు పేషెంటును మద్రాసు అపోలో హాస్పిటల్‌కి తీసుకెళుతున్నారు. కూడా డాక్టర్ గారు, ఆ పేషెంటు యొక్క భార్య, పిల్లలు ఉన్నారు. నేను అలా కూర్చుని ఉండగా, ఆ పేషెంటు భార్య ఏమన్నారంటే, నేను మిమ్మల్ని ఎరుగుదునని అన్నారు. అంతవరకు బానే ఉంది. మీరు భగవాన్ గురించి చెబుతూ ఉంటారు కదా అన్నారు. అంతవరకు బానే ఉంది. అక్కడితోటి ఆవిడ కాన్వర్సేషన్ ఆగిపోయింది. ఇక డాక్టర్ గారు మొదలు పెట్టారు, మీరు చెప్పే ఉపన్యాసాలు పేపర్‌లో చదువుతున్నాను అన్నారు. నేను పేషెంటుతో, మీరు కొంతకాలం కాంట్రాక్టర్‌గా చేశారు, నాకు గుర్తు ఉన్నారండి అన్నాను. అపుడు ఆ డాక్టర్ గారు ఈయన పూర్వం కాంట్రాక్టర్‌గా చేశారా అన్నారు! ఆయనకు వంద ఎకరాల కొబ్బరితోట కూడా ఉందండి అన్నాను. అంతవరకు డాక్టర్ గారు నెమ్మదిగా మాట్లాడుతున్నారు. ఒక్కసారిగా వంద ఎకరాలు ఉందా కొబ్బరితోట

అన్నారు! అంటే ఏమిటి ఆయన హృదయంలో ఆ డబ్బు మీద ఉన్నటువంటి అటాచ్మెంట్, ఒక్కసారి ఆ హృదయంలో నుంచి ఆ మాట ఎంత ఫోర్స్ గా వచ్చిందంటే, ఆయన హృదయంలో ఆ ప్రాపర్టీ మీద ఎంత అటాచ్మెంట్ ఉందో ఒక్కసారి నా మొఖానికి అద్దంలో చూపించినట్టు అనిపించింది.

మామూలుగా ఎడ్యుకేషన్ ఉంది, కాని మానసికంగా ఎంత backward స్థితిలో ఉన్నారో తెలుస్తుంది. అదీ మానసిక అనారోగ్యం అంటే. నాతోటి మామూలు విషయాలు మాట్లాడేటప్పుడు ఎంత నేచురల్గా మాట్లాడుతున్నారో, ఎంత నార్మల్ గా మాట్లాడుతున్నారో, వంద ఎకరాల కొబ్బరి తోట అనగానే అంతే నేచురల్గా మాట్లాడుంటే నేను అంత అప్సెట్ అవ్వకపోదును. ఆయన నేచురల్గా చెప్పలేకపోయాడు. ఎందుచేత చెప్పలేకపోయాడు? ఆయన హృదయంలో ఆ ప్రాపర్టీ అంటే డీప్ ఎఫ్లెక్షన్, డీప్ అటాచ్మెంట్, అదే మానసికమైన అనారోగ్యం. మన శరీరం శుభ్రంగా ఉండాలి అనుకుంటాము. మన బట్టలు శుభ్రంగా ఉండాలి అనుకుంటాము. మన పరిసరాలు శుభ్రంగా ఉండాలి అనుకుంటాము. మన ఇల్లు, వొళ్ళు శుభ్రంగా ఉంచుకోవాలి అనుకుంటాము. మన మనసు మట్టుకు శుభ్రంగా ఉంచుకోవాలి అనుకోము. కానీ మనకూడా వచ్చేది అదే. మనసు శుచిగా లేని వాడికి ఆధ్యాత్మిక విద్య రాదు. ఆత్మ వైపు దారే కనపడదు.

మామూలుగా ఈ కనుబొమ్మలు ఉన్నాయి చూడండి వీటికి ఏమీ క్షవరం చేయించక్కరలేదు. మనము పుట్టినప్పుడు ఇలాగే ఉంటాయి. చచ్చిపోయినప్పుడు ఇలాగే ఉంటాయి. కొంతమంది మనుషులు అలాగే ఉంటారు. ఎక్కడ వేసిన పేడ అక్కడే ఉంది అంటారు చూడండి, అలా అసలు మనము ఎవాల్వ్ (evolve) అవ్వటానికి, చేంజ్ని ఒప్పుకోము. ఇప్పుడు నేను ఇక్కడి నుంచి ఆ మురికి కాలువ దగ్గరకి వెళ్ళాలి అనుకోండి, ఆ బ్రిడ్జ్ దగ్గరకి వెళ్ళాలి అనుకోండి. నేను ఇక్కడ నుంచి కదలను కానీ ఆ బ్రిడ్జ్ దగ్గరకి వెళ్ళాలి అంటే ఎలా కుదురుతుంది? ఇది సైకాలజీ కి సంబంధించిన ప్రశ్న, ఇది జాగ్రత్తగా ఆలోచించండి. ఏ తలంపులు అయితే మనకి అనారోగ్యాన్ని తీసుకువస్తున్నాయో, ఏ భావాలు అయితే మనకి అనారోగ్యాన్ని తీసుకువస్తున్నాయో, ఏ రాగద్వేషాలు అయితే మనకి అనారోగ్యాన్ని తీసుకువస్తున్నాయో, అవి విడిచి పెట్టను. నేను మార్పు పొందాలి, ప్రగతి పొందాలి అంటే, ఇవి విడిచి పెట్టకుండా ప్రగతి ఎలా వస్తుంది? నేను కాళ్ళు కదపకుండా ఉంటే ఆ బ్రిడ్జ్ దగ్గరకి ఎలా వెళ్లగలను? నేను గమ్యానికి వెళ్లాలని కోరుతున్నాను గాని మార్పుని కోరటం లేదు. నాలో మార్పు రాకుండా గమ్యాన్ని ఎలా చేరుకోగలను? మీకు కావాలి మోక్షం, నాకు కావాలి మోక్షం.

కానీ మారటానికి ఇష్టపడటం లేదు. మీరు బాగా ఆలోచించండి. మనకి కలకత్తా వెళ్లాలని ఉంది, కాశీ వెళ్లాలని ఉంది కానీ ప్రయాణం చేయటం ఇష్టం లేదు. ప్రయాణం చేయకుండా అక్కడకు ఎలా వెళ్లగలవు? ఛేంజ్ లేకుండా ఎలా ఎవాల్వ్ (evolve) అవుతారు? ప్రస్తుతం మనకున్న భావాలని విడిచిపెట్టకపోతే, మనకి నవీన భావాలు ఎలా వస్తాయి? నిజంగా మీకు మోక్షం కావాలి అనుకుంటే. నిజంగా మీరు పర్ఫెక్షన్ చేరుకోవాలి అనుకుంటే, మనుషులు అందరూ మారాలి. మానసిక జీవితంలో గనుక మార్పు రాకపోతే ఆ మనిషికి ఇంక అభివృద్ధి లేదు. ప్రగతి లేదు. సుగతి లేదు.

మనం నలభై సంవత్సరాలో, యాభై సంవత్సరాలో, జీవించాము అనుకోండి. మనసు ఏమి వికసిస్తోంది, మనసు ఏమి ఎదుగుతోంది? మనసు ఎంత ఆరోగ్యంగా ఉంటోంది? మన మనసు మనల్ని సుఖపెడుతోందా? మన మనస్సు ఎంత నిర్మలంగా ఉంటోంది? పూర్వం ఉన్న భావాలు ఎటువంటివి? ఇప్పుడున్న భావాలు ఎలా ఉన్నాయి? ఈ భావాలలో ఏమైనా మార్పు వస్తోందా? ఈ తలంపులో ఏమైనా మార్పు వస్తోందా? మంచిస్థితికి తీసుకువెళ్లే భావాలు వస్తున్నాయా మనకి? మీకొచ్చే తలంపుల విషయంలో ఇవన్నీ ఎప్పుడైనా మీరు ఆలోచిస్తున్నారా? మీ తలంపుల విషయంలో మీరు జాగ్రత్త పడకపోతే మీకు మానసికమైనటువంటి ఆరోగ్యం రాదు. కొంతమంది మనుషులు ఎలా ఉంటారంటే. రోడ్డు మీద మైలు రాళ్ళు ఉంటాయి చూడండి. రెండో మైలు, మూడో మైలు, నాలుగో మైలు, ఇన్ని మైళ్ళు ఉన్నాయి, అని తెలియచెప్పటానికి మైలు రాళ్ళు వేస్తూ ఉంటారు రోడ్డు మీద, పాలకొల్లు ఇన్ని మైళ్ళు అని, నరసాపురం ఇన్ని మైళ్ళు అని మైలు రాళ్ళు వేస్తారు రోడ్డు మీద. ఆ మైలు రాయి ఏమీ ప్రయాణం చేయదు. ఆ రాళ్ళు ఎక్కడ ఉంటాయో అక్కడే ఉంటాయి. ఆ మైలు రాయి ఏ విధంగా అయితే ప్రయాణం చెయ్యదో, అలాగే మనుషులు కూడా కొంతమంది మైలు రాళ్ళు. మనసు కనుక వికసించకపోతే జ్ఞానం రానే రాదు.

ఎవడైతే లోపలఉన్న శరీరం, మానసికశరీరం విషయంలో జాగ్రత్త పడుతున్నాడో వాడికే ఆధ్యాత్మిక స్థితి వస్తుంది, వాడికి సౌందర్యం వస్తుంది! మీరు ఎప్పుడైనా సౌందర్యాన్ని ప్రేమించారా? మీరెప్పుడైనా సత్యాన్ని ప్రేమించారా? సత్యాన్ని ఎప్పుడైనా ప్రాక్టీస్ చేస్తున్నారా మీరు. ఎవరైతే ట్రూత్‌ని ప్రాక్టీస్ చేస్తారో వాడికి ట్రూత్ తెలియకుండా ఎలా ఉంటుంది? పరబ్రహ్మ రూపం ఒక్కటే సత్య రూపం. మనం ఎవరై ఉన్నాం? మనం శరీరమా? మనస్సా? పరబ్రహ్మ వస్తువా? మీరందరూ మోక్షం కావాలి, మోక్షం కావాలి అంటున్నారు. ఆచార్యులవారు ఏమంటున్నారు అంటే మీరు మోక్షం అడగటం ఏమిటి, మీరు మోక్షంలోనే ఉన్నారు

అంటున్నారు. మనం ఆ పరబ్రహ్మ వస్తువే అయ్యి ఉన్నాము. అయితే మరి దుఃఖం ఎందుకు వస్తోంది? దేహాన్ని పరబ్రహ్మ వస్తువు అనుకుంటున్నాము కాబట్టి దుఃఖం వస్తోంది. దేహాన్ని ఆత్మ అనుకుంటున్నాము. దేహాన్ని పరబ్రహ్మం అనుకుంటున్నాము అందుకు దుఃఖం వస్తుంది. దేహమే ఆత్మ అనుకునే బుద్ధి మనకి ఉంది. దేహమే సత్య వస్తువు అనుకునే బుద్ధి మనకి ఉంది. దేహం సత్యం అని చెప్పటం లేదు ఆచార్యులవారు. దేహం ఆత్మ అని చెప్పటం లేదు. దేహం పరబ్రహ్మ అని చెప్పటం లేదు. కానీ దేహమే నిజం అనుకుంటున్నాము. దేహమే ఆత్మ అనుకుంటున్నాము. దేహమే పరబ్రహ్మ అనుకుంటున్నాము. అందుకే మనకి దుఃఖం వస్తోంది. ఒక్క పరబ్రహ్మంలోనే దుఃఖం లేదు. మన స్వరూపమే పరబ్రహ్మ స్వరూపం. అది మనం అయ్యి ఉన్నాము. అయితే అది ఎందుకు మనకి అనుభవంలో లేదు? ఈ మానసిక శరీరంలో ఉన్న అనారోగ్యం వల్ల లేదు. ఇది బాగా అర్థం చేసుకోండి. పరబ్రహ్మ స్వరూపం మనం అయ్యి ఉన్నాము. I am that నేను అది అయ్యి ఉన్నాను. you are that మీరు అదే అయ్యి ఉన్నారు. అది ఎందుకు మనకు అనుభవంలో లేదు. అది ఎందుకు మనకు అనుభవంలోకి రావడం లేదు అంటే మానసిక అనారోగ్యమే అడ్డు వస్తోంది. శారీరక అనారోగ్యం కాదు అడ్డు వస్తుంట. మానసికమైన అనారోగ్యం అడ్డు వస్తుంది.

ఎవడైతే మనసుని ఆరోగ్యంగా ఉంచుకుంటాడో వాడు మనసును దాటగలడు. నా శరీరంలో రోగం ఉందనుకోండి, నిరంతరం శరీరం జ్ఞాపకం వస్తుంది. నా శరీరం ఆరోగ్యంగా ఉంటే శరీరం జ్ఞాపకం రాదు. మనసు ఎవడికైతే పూర్తిగా ఆరోగ్యంగా ఉందో వాడు మనసుని దాటగలడు. మనసుని దాటిన వాడు జ్ఞాని అవుతాడు. నా మనస్సుని నేను మింగితే నేను జ్ఞాని, మీ మనస్సుని మీరు మింగితే మీరు జ్ఞాని.

మీ డబ్బు మీ దగ్గర అట్టే పెట్టుకోండి. మీ గౌరవాలు కూడా అట్టే పెట్టుకోండి. మీ సంపదలు, మీ గౌరవాలు, మీ కీర్తులు, ఇవన్నీ కూడా మీరు అట్టే పెట్టుకోండి. కాని ఆత్మను తెలుసుకోవడానికి ఏ తలంపైతే అడ్డు వస్తుందో ఆ తలంపుని విడిచిపెట్టినవాడు, ఆ తలంపును త్యాగం చేసినవాడు నిజమైన త్యాగి. నేను పరబ్రహ్మ స్వరూపమే, అయితే పరబ్రహ్మ స్వరూపం నా అనుభవంలో లేదు. నా స్వరూపం నాకు అనుభవంలోకి రాకుండా ఏ తలంపులైతే నాకు అడ్డు వస్తున్నాయో, ఆ తలంపులు ఎవరైతే విడిచి పెట్టగలుగుతారో వాళ్ళు నిజమైన త్యాగి. త్యాగి కానివాడు జ్ఞాని కాలేడు.

మామూలుగా పల్లెటూర్లలో రోడ్ల మీద ఏ విధంగా దెబ్బలాడుకుంటున్నారో, పెద్ద పెద్ద యూనివర్సిటీల్లో కూడా అలాగే దెబ్బలాడుకుంటున్నారు, కొట్టుకుంటున్నారు, నరుక్కుంటున్నారు,

అది చదువా? విద్యా? విజ్ఞానమా? చదువుంటే మాకు జ్ఞానం వస్తుంది అనుకుంటారేమో, ఆ మాయలో పడకండి. పొట్ట కోసం చేసే కృషిలో అదొకటి. దానికి, జ్ఞానానికి ఏమి సంబంధం లేదు. ఈ కాలేజీల్లోనూ, యూనివర్శిటీల్లోనూ చదివే చదువు గనుక నిజమైన చదువు అయితే ఇన్ని గొడవలు ఎందుకు వస్తున్నాయి? బజారులో ఎన్ని దెబ్బలాటలు ఉన్నాయో, యూనివర్శిటీల్లో అన్ని దెబ్బలాటలు ఉన్నాయి. అది జ్ఞానమా? అజ్ఞానమా?

చదువు లేదని మీరేమీ కంగారుపడకండి. చదువు కాదు ఇక్కడ పవిత్రత చాలా ముఖ్యం. ఎడ్యుకేషన్ కాదు ఎవడికైతే పవిత్రత ఉందో వాడికి ఆత్మ దర్శనం అవుతుంది. పరమపవిత్రుడు అయిన వాడికి ఆత్మ దర్శనం అవుతుంది కానీ చదువు ముఖ్యం కాదు. మీకు చదువు లేకపోవచ్చు, ధనం లేకపోవచ్చు, మీ హృదయంలో సౌందర్యాన్ని పెంచుకోండి. మనం సత్యం కోసం కానీ, శాంతి కోసం కానీ, ప్రేమ కోసం కానీ, అసలు జీవిస్తున్నామా? మన ఇష్టాయిష్టాల కోసం జీవిస్తున్నామా లేక సత్యం కోసం, శాంతి కోసం, ప్రేమ కోసం జీవిస్తున్నామా? భగవాన్ చెప్పిన మాటలు మీద గాని, గీతలో చెప్పిన మాటలు మీద కాని మీకు ఏమైనా ప్రేమ కలుగుతోందా? మీ ఇంట్లో ఉన్న పిల్లల మీద మీకు ఎంత ప్రేమ ఉందో, కనీసం అంత ప్రేమ అయినా మీకు భగవాన్ చెప్పిన మాటల మీద కలుగుతోందా? కలగటం లేదు. అదే మానసిక అనారోగ్యం యొక్క లక్షణం. మీ చుట్టాల మీద, మీ స్నేహితుల మీద ఉన్న నమ్మకం భగవంతుడు చెప్పిన మాటల మీద మీకు ఎందుకు లేదు? కారణం మానసిక అనారోగ్యం.

పరబ్రహ్మ స్వరూపం నేను అయి ఉన్నాను అని చెబుతున్నాడు కదా భగవంతుడు, ఆచార్యులవారు చెబుతున్నారు కదా, అయితే ఇప్పుడు నాకు ఏది అడ్డు వస్తుంది. యదార్థం చెప్పాలంటే మనం మోస్తున్న బరువు ఎవరు మోయటం లేదు. ఎంతో బరువు మోస్తున్నాము. భరించలేనటువంటి బరువు మోస్తున్నాము. అది మన శరీరాన్ని క్రుంగదీసేస్తోంది, మన మనసుని క్రుంగదీసేస్తోంది. శరీరానికి అనారోగ్యం వస్తోంది, మనసుకి అనారోగ్యం వస్తోంది. ఎంత బరువు అంటే ఈ బరువు, పది బస్తాల బియ్యం బరువు మోయగలము కానీ, అహంకారాన్ని మోయలేము. ఈ అహంకారాన్ని మోసుకుతిరగడం వల్లే, మన శారీరక ఆరోగ్యం చెడిపోతుంది. మానసిక ఆరోగ్యం చెడిపోతుంది. నిరంతరం జీవితం అంతా దుఃఖ మయం అయిపోతుంది.

అహంకారం అనే బరువుని ఎవరైతే కింద పెట్టేశాడో, ఎవడైతే వదిలేశాడో, వాడికింక బరువంటూ లేదు. అహంకారం మనిషి మీద వేసే బరువు కంటే ఈ సృష్టిలో ఇంక అంత

బరువు లేదు అసలు. నీకు దుఃఖం వస్తుందంటే ఎందుకు దుఃఖం వస్తుంది? అహంకారం నీ నెత్తిమీద పెట్టిన బరువు వల్ల నీకు దుఃఖం వస్తుంది. మనసు సెంటుపర్సెంటు పరిపూర్ణంగా ఆరోగ్యంగా ఉంటే, అది కండిషన్ లో గనుక ఉంటే, అది మీకు తెలియకుండానే ఆత్మాకారం చెందుతుంది. పరిశుద్ధమైన మనసుకి, పరబ్రహ్మకి తేడా లేదు. నో డిఫరెన్స్. ఎవరైతే పరిశుద్ధమైన మనసుని సంపాదించారో ఆ పరిశుభ్రమైన మనస్సే పరబ్రహ్మ ఆకారం చెందుతుంది. రెండింటికి తేడా లేదు. అయితే మన మనస్సు పరిశుభ్రం కాలేదు కాబట్టి, మోక్షం ఎక్కడో ఉందని, మనం ఎక్కడో ఉన్నామని వీటి మధ్య ఘర్షణ పడుతున్నాం. అజ్ఞానం ఎక్కడ ప్రారంభం అవుతుంది అంటే, దేవుడు ఎక్కడో ఉన్నాడు, మనం ఎక్కడో ఉన్నాము, మనం ఎంతో దూరం నడవాలి అని ఇలా ప్రారంభం అవుతుంది. మన మనసుకు సెంటుపర్సెంటు ప్యూరిటి గనుక వస్తే, అప్పుడు క్లారిటీ వస్తుంది కానీ ప్యూరిటి లేనప్పుడు క్లారిటీ కూడా ఉండదు.

కాలులో ముల్లు విరిగితే మనం కంగారు పడతాము, కంట్లో నలక పడినా కంగారు పడతాము. సందేహాలు, సంశయాలు అనే ముల్లులు మన మనసులో ఎన్ని ఉన్నాయో, ఆ ముల్లులను తీసుకోవడానికి మీరు ఎప్పుడైనా ప్రయత్నం చేసారా? మాట్లాడితే సందేహాలు, మాట్లాడితే సంశయాలు, ఈ విపరీత బుద్ధి, ఈ సంశయాలు, సందేహాలు అనే ముల్లుల తోటి మనస్సంతా గుచ్చేసుకొని మనం ఉంటే, ఈ ముల్లులు తీసుకోవడానికి ఎప్పుడైనా మీరు ప్రయత్నం చేశారా? చిన్న ముల్లు గుచ్చుకుంటే మీరు ఆసుపత్రికి పరిగెట్టుకుని పోతున్నారు కదా డాక్టర్ గారిని తియ్యమని. కానీ సంశయం అనే ముల్లుని ఎప్పుడైనా మనసులో నుండి తీసుకోవడానికి ప్రయత్నం చేశారా? ఎవడైతే ఈ ముల్లుని బయటకి తీసుకోలేడో వాడికి జ్ఞానము రాదు.

మీరు పూజలు చేస్తున్నారు. జపాలు చేస్తున్నారు. మంత్రాలు జపిస్తున్నారు. మీరు చేసిన జపాలు, మీరు చేసిన మంత్రాలు నిజం అయితే ఆ ముల్లులు బయటకి ఎందుకు రావటం లేదు? వెనకో డాక్టర్ గారు చెప్పారంట ఆపరేషన్ గొప్పగా సక్సెస్ అయ్యింది కాని మనిషి చచ్చిపోయాడు అన్నాడంట. మనం పూజలు బాగానే చేస్తున్నాము, జపాలు బాగానే చేస్తున్నాము. కానీ అహంకారం బయటకి పోవటం లేదు. ఆపరేషన్ బాగానే చేస్తున్నాము. అసలు ఆపరేషన్ ఎందుకు? మనిషిని బ్రతికించటానికి కదా ఆపరేషన్ చేస్తాము. ఈ పూజలు, జపాలు ఎందుకు? మానసిక ఆరోగ్యం కోసం కదా కాని వాటి వలన మానసిక ఆరోగ్యం రావటం లేదు. ఎందుచేత? మీరు నోటితో చెప్పే మంత్రంలో మనసు లేదు. మీరు చేత్తోటి

చేసే పూజలో మనస్సు లేదు. యంత్రం చేసినట్టు చేస్తున్నారు. మీరు చేసే పూజలు కూడా మెకానికల్‌గా చేస్తున్నారు. మెకానికల్‌గా చెయ్యటం వల్ల మనస్సు మీద దాని ఎఫెక్టు పడదు.

Everything is business in the world! పాఠం చెప్పే మాష్టారుకి వాడి మాటలే వాడి బిజినెస్. ఇంజినీరుకి కాంట్రాక్టుల తోటి బిజినెస్, డాక్టరుకి వాడి మెడిసినే వాడికి బిజినెస్. అలాగే భక్తి కూడా మనకి బిజినెస్ కింద తయారయ్యి పోయింది. కొంతమంది ఎంతో పరిశుద్ధంగా ఉండే వాళ్ళు కూడా మెంటల్ లైఫ్ లేని వాళ్ళను చూసాం. కొంతమంది చాలా నాజూకుగా మాట్లాడతారు. స్వచ్ఛంగా మాట్లాడతారు, తెలివిగానే మాట్లాడతారు. వాళ్లకి కూడా మెంటల్ లైఫ్ లేదు.

మీరు చేసే పూజల వల్ల, మీరు చేసే జపాల వల్ల, మీరు చేసే నోముల వల్ల, మీరు చేసే వ్రతాల వల్ల, భగవంతుడి మీద విశ్వాసం కనుక పెరగకపోతే, భగవంతుడి పట్ల మీకున్న అనుమానాలు తొలగకపోతే, వీటివల్ల ప్రయోజనం ఏమీ లేదు. దేవుడి అనుగ్రహం లేదు, పరబ్రహ్మ అనుగ్రహం లేదు అనుకోవటం ఎలావుంటుంది అంటే పీక దాకా చెరువులో దిగి నాకు దాహం వేస్తుంది అని ఏడ్చేవాడు ఎటువంటివాడో మాకు అనుగ్రహం లేదు అని ఏడవటం కూడా అటువంటిదే అన్నారు భగవాన్. ఒకడు పీక దాకా చెరువులో దిగాడట, నీళ్ళు అక్కడే ఉన్నాయి, వాడు చెరువులోనే ఉన్నాడు. నాకు దాహం వేస్తుంది, దాహం వేస్తుంది అని వెర్రి కేకలు వేస్తున్నాడట. ఆయన గురించి మనం ఏమి అనుకుంటామో దేవుని అనుగ్రహం లేదు అని మన వెర్రి కేకలు కూడా అటువంటివే. మనం పరబ్రహ్మ స్వరూపంలో పీక దాకా మునిగి ఉన్నాము.

చాలామంది దేవుడిని సుఖాలు కోరుకుంటారు. కష్టాలు ఎప్పుడూ రాకూడదు అనుకుంటారు. మన మనసులో వంకరలు ఉంటాయి అనుకోండి. కష్టం మనసులో ఉన్న వంకరలు తీస్తుంది కానీ, సుఖం మట్టుకు మనసులోని వంకరలు తియ్యలేదు. పచ్చి కుండ కాలకపోతే మనకి పనికిరాదు. కుండ కాలితే మనకి ఉపయోగం కానీ, కుండ కాలకపోతే మనకి ఏమి ఉపయోగపడుతుంది? కష్టాలు కూడా మిమ్మల్ని కాల్చి జ్ఞానము వైపు తీసుకెళతాయి. ఆ విషయం మీకు తెలియక కష్టం వద్దు అనుకుంటారు. అంటే మిమ్మల్ని కష్టాలు కోరుకోమని కాదు నేను చెప్పేది. దైవికంగా మీకు కష్టాలు వస్తే ఆ కష్టాలు కూడా భగవంతుడు ఇచ్చిన వరాలు, ప్రసాదాలు అనుకోవాలి. చాలా మంది సుఖం వస్తే దైవానుగ్రహం వల్ల వచ్చింది అనుకుంటారు. సుఖం మీకు దైవానుగ్రహం వల్ల వచ్చింది అనుకుంటే, ఎప్పుడైనా కష్టం వస్తే, అది కూడా దైవానుగ్రహం వల్లే వచ్చింది అని మీరు

ఎందుకు అనుకోరు?

ఇక్కడే ఒకటి తేల్చేయండి మీరు. మీ మనసుకి కాని, నా మనసుకి కాని, మనకి జీవితంలో కావలసింది భోగామా, యోగమా? మన మనుస్సు ఏమి కోరుతోంది? భోగాన్ని కోరుతోందా? యోగాన్ని కోరుతోందా? మీ ఎదురుగా రెండే రెండు లక్ష్యాలు ఉన్నాయి. ఇంక ఏమి లేవు. ఒకటి భోగం, రెండు యోగం. ఇంక మూడోది లేదు. యోగాన్ని ఎవరైతే చేతితో పట్టుకున్నారో వారికి మోక్షం వస్తుంది. భోగాన్ని చేతితో పట్టుకున్న వారికి నరకం వస్తుంది. యోగం అనే రోడ్డు మోక్షానికి తీసుకువెళ్తుంది. భోగం అనే రోడ్డు నరకానికి తీసుకువెళుతుంది. రెండు రోడ్లు మీ ఎదురుగా కనిపిస్తున్నాయి మీరు ఏ రోడ్డు వెంట ప్రయాణిస్తారు? మీకు కావాల్సింది పర్ఫెక్షన్ (perfection) కావాలా, ఎంజాయ్మెంట్ (enjoyment) కావాలా?

భగవాన్ ఒక మాట చెప్పారు. ఉన్నది ఉన్నట్టుగా, ఉన్న వస్తువు గురించి ఉన్నట్టుగా చెబితే ఎవరికీ ఇష్టం ఉండదు అని చెప్పారు. కొంత మరుగు పెట్టి, మహిమలు చేసి, ఆ సబ్జెక్టుని కాంప్లికేట్ చేసి చెబితేనే చాలామందికి ఇష్టంగా ఉంటుందట. కొంతమంది గురువులు, కొన్ని మతాలు ఉన్నదానిని కాంప్లికేట్ చేసేస్తారు. ఏమీ అక్కర్లేదు మీ మనసులో మీరు గోడలు ఏమీ కట్టుకోకండి, మీకు జ్ఞానము వచ్చేస్తుంది. రోజూ సాయంత్రం మీరు ఇంటిదగ్గర ఏకాంతంగా కూర్చుని ఉన్నప్పుడు ఆకాశం వంక చూస్తూ ఉండండి. ఆకాశం వంక చూస్తుంటే మీ మానసిక ఆరోగ్యం బాగుపడుతుంది. మీ మనసు విశాలం అవుతుంది. జ్ఞానం కావాలి అంటే, మనం అలలు ఉన్న సముద్రంలా ఉండకూడదు. కెరటాలు లేని సముద్రంలా ఉండాలి. కెరటాలు లేని సముద్రం ఎంత ప్రశాంతంగా ఉంటుందో అంత ప్రశాంతంగా ఉంటే అప్పుడు మనకి జ్ఞానం వస్తుంది. ఎప్పుడో రేపు కాదు, ఇంకో గంట కాదు ఈ సెకనులో మీకు మోక్షం వస్తుంది పరిపూర్ణమైన విశ్వాసం మీకు ఈశ్వరుడి మీద కుదిరితే. మీ హృదయంలో విశ్వాసం లేకుండా వేము ముక్కులు మూసుకుంటున్నాము, పూజలు చేస్తున్నాము, ఏదో కష్టపడుతున్నాము అంటే ఏమీ రాదు. అహంకారం లేని మనిషికి మాట తోటి కూడా పనిలేదు. మానసిక ఆరోగ్యాన్ని ఎవడైతే జాగ్రత్తగా కాపాడుకొంటున్నాడో వాడికి జ్ఞానం కలుగుతుంది.

మీకు అందరికీ ఎంతో కొంత భక్తి ఉన్న మాట నిజమే, శ్రద్ధ ఉన్న మాట నిజమే, ప్రేమ ఉన్న మాట నిజమే. కానీ మీ మనసులో ఇప్పటికి కూడా ఒక నిర్ణయానికి రాలేదు. మన గమ్యం ఏమిటి, మనం పొందవలసింది ఏమిటి అనే దాంట్లో మీకు ఏమైనా క్లారిటీ

ఉందా? మనం పొందవలసింది, పొందామా లేదా అని కాదు. మనం పొందవలసింది ఏమిటి అనేదాంట్లో మీరు రాజీకి వచ్చారా? అసలు స్పష్టత ఉందా మీకు, ఇంకా ఏమైనా సంఘర్షణలు ఉన్నాయా మీ మనస్సులో? ఏమిటండి సాధన సాధన అంటారు. మనసును శుద్ధి చేసుకోవడమే సాధన. అంతకంటే సాధన ఏమి ఉంది? మనసును వదిలేసి నేను సాధన చేస్తాను అంటే ఎక్కడ కుదురుతుంది? మనసుని శుద్ధి చేసుకోవటమే సాధన. మీరు సాధన చెయ్యటం వల్లనే మోక్షం వస్తే అది నిజమైన మోక్షం కాదు. మీరు సాధన చెయ్యటం వల్లే కనుక మీరు ఆత్మని తెలుసుకుంటే అది ఆత్మ కానే కాదు. సాధన చెయ్యటం వలన ఆత్మ తెలియబడదు. సాధన చెయ్యటం వలన మనసులో ఉన్న అనారోగ్యం పోతుంది అంతే, ఆత్మ అక్కడే ఉంది. మీరు సాధన చెయ్యటం వల్ల ఆత్మ తెలిస్తే, అంటే మళ్ళీ మీరు సాధన మానేస్తే ఆత్మ పోతుందా! మనం చేసే సాధన తోటి, మనం చేసే గుంజీల తోటి ఆత్మకి ఏమీ సంబంధం లేదు.

మనం చేసే ఈ సాధనలు, మనస్సులోని దుమ్ము దులుపుకోవటం కోసం. ఇంట్లోని దుమ్ముని ఎలా దులుపుకుంటున్నామో మీ మనసులోని దుమ్ముని అలా దులుపుకోవాలి. ఇంట్లోని దుమ్ముని దులుపుకోవటానికి చీపురు కట్టని ఏ విధంగా అయితే ఉపయోగించుకుంటున్నామో మన మనసులోని దుమ్ము దులుపుకోవటానికి ప్రార్థనని అలా ఉపయోగించుకుంటున్నాము. మన సాధనలు మనసులోని దుమ్ము దులుపుకోవటం కోసం. మోక్షం అక్కడ రెడీగా ఉంది మన కోసం. మీరు సాధన చేయటం వల్ల తెలియబడేది కాదు ఆత్మ. మీ సాధనకి ఆత్మకి ఏమీ సంబంధం లేదు. ఆత్మ ఎన్నడూ బంధంలో లేదు, దానికి మోక్షం అక్కరలేదు. ఆత్మ మన హృదయంలో ఎప్పుడూ ప్రకాశిస్తోంది, ఎప్పుడూ బంధంలో లేదు. ఆత్మకి బాంధవ్యం లేనే లేదు.

ఆధ్యాత్మిక జీవితం, ఆత్మ జీవితం ఒకసారి రుచి చూస్తే, ఆ రుచి నుండి మీ మనసు బయటకి కదలదు. ఒక పంచదార కుండలో ఎర్ర చీమని పడేస్తే ఎలా ఉంటుందో అలా ఉంటుంది. ఆధ్యాత్మిక జీవితం యొక్క రుచి గనుక మీకు తెలిస్తే మనస్సు అక్కడి నుంచి కదలదు. ఆత్మకి మించిన సౌందర్యం లేదు. మీకు నిజంగా ఆత్మ యొక్క స్పర్శ గనుక తెలిస్తే, ఆత్మ యొక్క ఆవరణలోకి మీరు అడుగు పెడితే, ఆత్మ యొక్క రుచి కొన్ని సెకన్లు అయినా మీరు జీవితంలో అనుభవించి ఉంటే మీరు ఏ దేవుడిని అయితే ప్రార్థిస్తున్నారో ఆ దేవుడొచ్చి మీ ఎదురుగా నుంచున్నా మీకు కళ్ళెత్తి చూడాలని ఉండదు. అదీ ఆత్మ యొక్క వైభవం.

మీరు డైరెక్టుగా భగవాన్ భక్తులుగా ఉండి భగవాన్ దారిలోకి వచ్చారు అనుకోండి, మీకు కంపారిటివ్ స్టడీ (comparative study) తక్కువగా వుంటుంది. మీరు రావడమే భగవాన్ యొక్క స్పర్శలో పడితే, భగవాన్ యొక్క వలలో పడితే కనుక, మీకు భగవాన్ టీచింగ్ లో ఉన్న ఔన్నత్యం తెలియదు. కొంతకాలం దరిద్రం అనుభవించి తరువాత డబ్బు వచ్చినవాడికి ఆ డబ్బు విలువ తెలుస్తుంది. పుట్టుక తోటే ధనవంతుడు అయితే వాడికి డబ్బు విలువ సరిగ్గా తెలియదు. కొంతకాలం ఆకలితో బాధ పడినవాడికి అన్నం విలువ తెలుస్తుంది. డైరెక్టుగా భగవాన్ బోధలోకి వచ్చిన వారికి ఆ టీచింగులో ఉన్న విలువ తెలియదు. ఆయన చూపు ద్వారా, ఆయన మాటల ద్వారా మనకి జ్ఞానం కలుగుతుంటే, ఇంక సాధనతో పని ఏముంది? వాళ్ళ చూపు ద్వారా మన మనసు పడిపోతుంది. వాళ్ళ మాట ద్వారా మన మనస్సు పడిపోతుంది. వాళ్ళ యొక్క స్మరణ ద్వారా మన మనస్సు పడిపోతుంది. ఇంక ఏమిటి మనం చేసే సాధన? కాలాన్ని అనవసరంగా ఖర్చు పెట్టుకోకండి. మీరు లోకుల మాటలను గౌరవిస్తూంటే కాలాన్ని వేస్ట్ చేస్తున్నట్టు. లోకులు చెప్పే మాటలకి మీరు గౌరవం ఇస్తున్నారు అనుకోండి, మీ కాలం ఖర్చు అయిపోతుంది అది ముందు మీరు అర్థం చేసుకోండి. లోకులు అంటే లౌకికులు. లౌకికులకి దగ్గరయ్యేకొద్దీ మనసుకి అనారోగ్యం పెరుగుతుంది.

మానవజన్మ దొరికితే చాలదు. మానవజన్మ వచ్చిన తరువాత సత్పురుషుల సహవాసం దొరకాలంటే, ఆ జీవుడికి ఎన్ని జన్మల సుకృతం ఉండాలో అన్నారు ఆచార్యస్వామి. మానవజన్మ ఒక్కటే వస్తే చాలదు. మానవజన్మ వచ్చిన తరువాత భగవంతుని యందు భక్తి, భగవంతుని యందు భక్తి తో పాటు సత్పురుషుల యొక్క సహవాసం ఏ జీవుడికైతే దొరుకుతుందో. ఆ జీవుడు పూర్వజన్మలో ఎంత సుకృతం చేసి ఉండాలో? ఎంత పుణ్యం వాడికి పండి ఉండాలో? ఎంతో పుణ్యం ఉంటే, ఎంతో సుకృతం ఉంటే, అటువంటి జీవుడికి మాత్రమే మానవజన్మతో పాటు సత్పురుషుల సహవాసం దైవికంగా దొరుకుతుంది అన్నారు ఆచార్యులవారు. సత్పురుషుల సహవాసం కనుక దొరికితే, విపరీతమైన గాలి వేస్తున్నప్పుడు విసినకర్రతో పని ఏ విధంగా అయితే ఉండదో, సత్పురుషుల సహవాసం పొందితే మీ సాధనతో పనిలేకుండా మోక్షం పొందుతారు అన్నారు ఆచార్యులవారు. గాలి వేస్తుంటే విసినకర్రతోటి పని లేదు. అలాగే సత్పురుషుల సహవాసం ఉంటే మీ సాధనల తోటి పని లేదు. అయితే మానవ జన్మ రావటం, భగవంతుడు ఉన్నాడని విశ్వాసం కలగటం. ఈ రెండింటితోపాటు మీకు దైవికంగా సత్పురుషుల సహవాసం దొరకటం, ఎంతో పుణ్యం యొక్క ఫలితం అన్నారు ఆచార్యులవారు. ఆత్మ అనేది ఒకటి ఉన్నదని, దాన్ని తెలుసుకోమని మీకు

చెప్పేవాడు ఈ లోకంలో ఎవడూ లేడా!

జ్ఞానాన్నే మోక్షం అంటాము. జ్ఞానమే మోక్షం. దీనికి ధైర్యం ఉండాలి దుష్ట సహవాసాన్ని ఎంత తొందరగా వదిలేస్తే, అంత తొందరగా వాడు ఆత్మ సన్నిధానం లోకి వెళ్తాడు. కొంతమంది ఉపవాసాలు చెయ్యమంటే చేస్తారు కాని సహవాసాలు విడిచిపెట్ట మంటే విడిచిపెట్టరు. శరీరానికి స్నానం ఎటువంటిదో మనసుకి ప్రార్థన కూడా అటువంటిది. మనకున్న అజ్ఞానమే దుఃఖరూపంలో వస్తుంది. అజ్ఞానమే రాగ ద్వేషాల రూపంలో వస్తుంది. యదార్థం చెప్పాలంటే మీరు నేను ఇక్కడ కూర్చుని మాట్లాడుకుంటున్నాం ఇది అబద్దం. కాని ఆత్మ నిజం. మనం ఇలా కూర్చుని మాట్లాడుకోవటం స్వప్నమే, ఇది నిజం కాదు. కాని ఆత్మ నిజం.

ఆచార్యులవారు ఇదే ప్రశ్నించారు. ఇదంతా అబద్ధం అయితే ఈ బోధలు, ఈ గొడవలు ఎందుకు అన్నారు ఆచార్యులవారు. ఇదంతా అబద్ధం అన్నారు కదా, నేను చెప్పటం, మీరు వినటం ఇదంతా ఎందుకు అన్నారు ఆచార్యులవారు. కాని ఇదంతా కల అన్నారు ఆయన. మీరు రాత్రుళ్ళు నిద్రలో ఉన్నారు అనుకోండి, ఆ నిద్రట్లో మీకు స్వప్నం వచ్చింది అనుకోండి, ఆ స్వప్నంలో ఏదో జరుగుతూ ఉంది. ఆ స్వప్నంలోకి మీకు సింహం వచ్చింది అనుకోండి,అప్పుడు మీకు భయం వేసి మెలకువ వస్తుంది. కలలో సింహం వచ్చిన మాట అబద్ధం కాని మీకు మెలకువ వచ్చిన మాట నిజం. అయితే మనం ఈ భోదనలు ఇదంతా చెప్పుకోవటం అబద్ధమే కాని వ్యవహారిక సత్యాలు ఇవి. కాని వీటి వల్ల వచ్చే ఆత్మ యొక్క జాగృతి, వచ్చే మెలకువ మటుకు నిజం. బోధ మటుకు అబద్ధం. అంటే ఈ బోధ ఎలా ఉపయోగపడుతుంది? మీకు కలలో వచ్చిన సింహంలా ఉపయోగపడుతుంది. కలలో వచ్చిన సింహం అబద్ధం కాని మీకు మెలకువ రావటం మాత్రం నిజం. అదేవిధంగా భగవంతుడు చెప్పినటువంటి ఈ బోధ కూడా అసత్యం అయినప్పటికీ ఆత్మ వైపుకి మెలకువ తెస్తుంది. జగత్తంతా స్వప్నం. మరణించటం కూడా స్వప్నం. మరణించటం నిజం అనుకోకండి, అది కూడా కలే. మళ్ళీ జన్మిస్తాము. మళ్ళీ కొత్త శరీరం వస్తుంది అది కూడా నిజం అనుకోకండి. అది కూడా కలే. ఆత్మ తప్పించి ఎక్కడ విహరించినా కూడా అదంతా స్వప్న తుల్యమే.

సోదర మహాశయులారా! ఎవరికైతే జీవలక్షణాలు ఉన్నాయో వారికి జ్ఞానం రాదు. మన మెంటల్ బాడీ జ్వరంతోటి ఉంది అందుచేత మనకి సత్యం తెలియటం లేదు. ఇప్పుడు అది నేచురల్ స్టేట్ కి రావాలి. మనకి జ్వరం తగ్గి నార్మల్ స్టేటుకి వస్తే గాని ఆకలి పుట్టదు. మనసులోని జ్వరం తగ్గితే గాని భగవంతుడు చెప్పిన మాటల మీద రుచి దొరకదు. మీకు

ఎప్పుడైనా కోపం వచ్చినప్పుడు గాని, చిరాకు వచ్చినప్పుడు గాని, ఎమోషన్ వచ్చినప్పుడు గాని, శరీరం కొంచెం వేడి ఎక్కినట్టు ఉంటుంది. నేను చెప్పినవి అన్నీ నమ్మొద్దు. మీరు టెస్ట్ చేసుకోండి. పరిశోధించుకోండి. మీకు ఎప్పుడైనా కోపం వచ్చినప్పుడు గాని, లస్ట్ వచ్చినప్పుడు గాని, ఎమోషన్ వచ్చినప్పుడు గాని మీరు ఇంటిదగ్గర చూసుకోండి మీ బాడీలో ఉష్ణోగ్రత పెరుగుతుంది. అంటే మనసులోని వేడే శరీరంలోకి దిగుతుంది. వీటి రెండింటికి అవినాభావ సంబంధం ఉంది.

సోదర మహాశయులారా! మనసులోని దోషాలకి ఈ శరీరాన్ని శిక్షిస్తారు. మనస్సు లోని దోషాలు మళ్ళీ శరీరంలోకి వచ్చి బయటకు పోగొట్టుకోవాల్సిందే కాని, నువ్వు తప్పు చేశావా శరీరాన్ని ఇచ్చి శిక్షిస్తారు. మంచి చేశావా శరీరాన్ని ఇచ్చి శిక్షిస్తారు. చెడు చేశావా శరీరాన్ని ఇచ్చి శిక్షిస్తారు. శరీరం ఉండగా ఎవడైతే దోషం నుండి విముక్తి పొందాడో వాడికి జన్మ రాహిత్యం కాని మనసులో దోషం ఉన్నంత కాలం వాడికి దేహాలు వస్తూనే వుంటాయి. మనస్సే దేహంగా పరిణమిస్తోంది. మన మనస్సు మంచిది అవ్వచ్చు, చెడ్డది అవ్వచ్చు, కాని దేహంగా పరిణమించేది కూడా మనస్సే. కోరికలే దేహంగా ఒక రూపం దాలుస్తాయి. వాళ్ళ వాళ్ళ యొక్క కోరికలే, వాళ్ళ వాళ్ళ సంస్కారాలే, వాళ్ళ వాళ్ళ బలహీనతలే శరీర రూపం దాలుస్తాయి. మనిషి ఒక పొరపాటు చేశాడు అనుకోండి. ఆ పొరపాటుని శరీరం ఇవ్వకుండా ఎలా శిక్షిస్తాడు. శరీరం ఇచ్చే శిక్షిస్తాడు. మనిషి ఒక పుణ్యం చేశాడు అనుకోండి వాడికి శరీరం ఇస్తాడు, శిక్షిస్తాడు. ఇది ప్రకృతి యొక్క చట్టం. ఈ శరీరం పుణ్యపాపాల యొక్క వలయం.

రాగ ద్వేషాల లోంచే పుణ్య పాపాలు వస్తాయి. రాగ ద్వేషాల లోంచే కామ క్రోధాలు వస్తాయి. రాగ ద్వేషాలు లేవంటే కామ క్రోధాలు లేవు. అజ్ఞానం అంతా రాగ ద్వేషాల లోనే ఉంటుంది. అయితే భగవాన్ ఏమి చెప్పారంటే,వీటి గురించి మీరు ఆలోచించకండి. నిరంతరం ఆత్మ గురించి వినండి. ఆత్మ గురించి మననం చేయండి. నిరంతరం ఆత్మ గురించి స్మరించగా స్మరించగా మీ బలహీనతలు నుండి మీకు తెలియకుండానే దూరం అయిపోతారు అని చెప్పారు. మీరు నిరంతరం ఆత్మ గురించి చింతించగా చింతించగా ఆత్మ గురించి మననం చేయగా చేయగా ఆత్మ గురించి శ్రవణం చేయగా చేయగా జ్ఞానం గురించి శ్రవణం చేయగా చేయగా మీలో ఏమైనా బలహీనతలు ఉన్నప్పటికీ వాటి గురించి మీరు ఆలోచించక్కరలేదు. నేచురల్ గా వాటి నుండి దూరం అయిపోతారు. మీరు దేనినైతే గమ్యంగా పెట్టుకున్నారో దాన్నే స్మరించమన్నారు.

మీరు ఏది చేస్తే మంచో ఆత్మకి మీరేమి చెప్పక్కరలేదు, అది ఆత్మకి తెలుసు. మన అహంకారానికి ఉన్నన్ని తెలివితేటలు కూడా లేవనుకోకండి ఆత్మకి. ఆత్మ అందమైనది, ఆత్మ సత్యమైనది. ఆత్మ తెలివైనది. ఆత్మ జడ వస్తువు కాదు, నాలెడ్జ్ తో కూడుకున్నది. నాలెడ్జ్ యొక్క మరొక రూపమే ఆత్మ. ఆత్మలో ఇగ్నోరన్స్ లేదు, నాలెడ్జే ఉంది. బుద్ధిలో కనుక చిన్న లోపం ఉంటే, మీరు గుర్తుపెట్టుకోండి, చిన్న దోషం చాలు ఆ చిన్న దోషం కూడా భగవంతుడు చెప్పే మాటలను నమ్మనివ్వదు. మీరందరూ మంచి వాళ్ళే అనుకోండి, బుద్ధిలో ఏదో చిన్న దోషం ఉందనుకోండి, పెద్దది కూడా కాదు చిన్న దోషం ఉందనుకోండి, ఆ దోషం కూడా ద్వేషం క్రింద పరిణమించి, భగవంతుడు చెప్పే మాటలని మిమ్మల్ని నమ్మనివ్వదు. మనం చూసే దృశ్యాలలో జాగ్రత్తగా ఉండాలి. వినే మాటల్లో జాగ్రత్తగా ఉండాలి. తినే తిండిలో జాగ్రత్తగా ఉండాలి. కట్టుకునే గుడ్డలో జాగ్రత్తగా ఉండాలి. అన్ని విషయాల్లోను జాగ్రత్తగా ఉండాలి. చేను చుట్టూ కంచె ఎలా వేస్తారో, అలా మన జీవితం చుట్టూ కంచె వేసుకుని, వైరాగ్యం అనే కంచె చుట్టూ వేసుకుని, ఒళ్ళు దగ్గరపెట్టుకుని జాగ్రత్తగా బ్రతికితే ఏమైనా దారి కనిపిస్తుంది లేదంటే లేదు. చేను చుట్టూ దూడలు దిగకుండా ఎలా అయితే కంచె వేస్తారో అలా మన చుట్టూ వైరాగ్యం అనే కంచె వేసుకుని కొంచెం ముందుకి వెళితే దారి కనపడుతుంది.

మీరందరూ సుఖంగా, హ్యాపీగా ఉండాలని భగవంతుడు కోరుకుంటున్నాడు. భగవంతుడు కాకుండా మీరందరూ హ్యాపీగా ఉండాలని కోరుకునే మనిషిని ఎవరినైనా చూసారా మీరు ఈ సృష్టిలో? ఈ లోకంలో ఉన్న మనుషులను ప్రేమిస్తున్నట్టుగా కూడా మీరు భగవంతుడిని ప్రేమించలేరా? నిజంగా మీరు హ్యాపీగా ఉండాలని కోరుకుంటున్నారా? మీ స్వార్థం కోసం అయినా మీరు భగవంతుడిని ప్రేమించడం నేర్చుకోరా? "భగవంతుడి కంటే నా క్షేమం కోరే వాడు ఈ లోకంలో ఎవరున్నారు" అనే మాటని మంత్రంలా మీ గుండెల్లో దాచుకోండి.

ఉన్నది ఒక్కటే పరబ్రహ్మ వస్తువు అని ఆచార్యులవారు చెబుతున్నారు. మరి ఉన్నది ఒకటే వస్తువు అయినప్పుడు ఈ ప్రపంచం, ఈ జీవులు, ఈ జగత్తు, ఈ మాయ ఇదంతా ఏమిటి? ఉన్నది ఒకటే కదా, ఇంత గందరగోళం వచ్చేసింది ఏమిటి? ఉన్నది ఒకటే వస్తువు. "ఒకడవౌ నిను మాయ మొనరించి వచ్చువారెవరిది నీ జాలమరుణాచలా!" సోదర మహాశయులారా! మీరు ఆత్మని తెలుసుకుంటే గాని ప్రకృతి మనలని విడిచిపెట్టదు. ప్రకృతి మనకు రోగాలను తీసుకు వస్తుంది, దేహాలను తీసుకువస్తుంది, సందేహాలను తీసుకు

వస్తుంది, సంశయాలు తీసుకువస్తుంది, జన్మలను తీసుకువస్తుంది, అనారోగ్యాలు తీసుకు వస్తుంది. ఈ చావు పుట్టుకల మార్కెట్లో ఇంకెన్ని సార్లు తిరగాలో మనం? ఎన్ని సార్లు మరణించాలో, ఎన్ని సార్లు జన్మించాలో, ఎన్ని శవాలు మోయాలో, ఎన్ని శరీరాలని మోసుకు తిరగాలో! సత్యమైన వస్తువు మన హృదయంలో ప్రకాశిస్తూ ఉంటే, ఇక్కడే ఉన్న వస్తువుని వదిలేసి ఎక్కడో వెతకటానికి మనం ప్రయత్నిస్తున్నాము అంటే ఇదే మాయ.

విష్ణుభక్తులు నమ్మాళ్వారు చెప్పారు, ఓ పెరుమాళ్ళు, ఇంతకాలం నువ్వు వేరు నేను వేరు అని అనుకున్నాను. కాని ఇప్పుడు తెలిసింది. ఎప్పుడు తెలిసింది? నిన్ను తెలుసుకున్నాక తెలిసింది. ఏమని తెలిసింది? నేను లేను నువ్వు ఉన్నావు అని, అంటే జీవుడు లేడు, దేవుడు ఉన్నాడు అని. కాని మనం ఏమనుకుంటున్నాం అంటే నేను ఉన్నాను దేవుడు లేడు అనుకుంటున్నాం. నమ్మాళ్వారు లోకం యొక్క క్షేమం కోసం పుట్టాడు. నమ్మాళ్వారు పదహారేళ్ళో, పద్దెనిమిదేళ్ళో బ్రతికాడు అంతే ఈ లోకంలో. తల్లి కడుపులోనుండి బయటకి వచ్చాక మూత్రం బయటికి రానివ్వలేదు, మలం బయటికి రానివ్వలేదు. అపుడు తల్లితండ్రులు వీడెందుకు మనకి, వీడొక సుద్దలా ఉన్నాడు అనుకున్నారు. మలం బయటకి రావడం లేదు, మూత్రం రావడం లేదు, మాటలు రావట్లేదు. తమిళనాడు లోనే జరిగింది ఇది. అపుడేం చేసారంటే తల్లితండ్రులు, ఒక గుళ్ళోకి తీసుకెళ్ళి ఆ గుళ్ళో ఒక ఉయ్యాల కట్టి, ఆ ఉయ్యాలలో పడుకోబెట్టి ఇంటికి వెళ్ళిపోయారు. ఇక మనకి వాడికి సంబంధం లేదు అని ఉయ్యాలలో పెట్టేసి వాళ్ళు వెళ్ళిపోయారు. తల్లితండ్రులను ఇంటికి వెళ్ళిపోనిచ్చాడు. వాడు లోకం కోసం మన కోసం వచ్చాడు వాడు. నెమ్మదిగా నడిచి వెళ్ళిపోయి ఒక చెట్టు తొర్రలో కూర్చున్నాడు. పుస్తకాలు రాయలేదు ఉపన్యాసాలు చెప్పలేదు. ఒక చెట్టు తొర్రలో కూర్చున్నాడు. వాడి జీవితం అంతా చెట్టు తొర్రే. పదహారు సంవత్సరాల పాటు చెట్టు తొర్రలో ఉన్నాడు. ఎన్నో స్తోత్రాలు చెప్పాడు విష్ణువు మీద. చెప్పి చెప్పి ఆఖరున చెప్పాడు ఈ మాట. నీ మీద ఇన్ని స్తోత్రాలు చెప్పాను ఇన్ని భజనలు చేశాను. ఇన్ని కీర్తనలు చేశాను పెరుమాళ్ళూ! నేను సాధన చేసింది నిన్ను తెలుసుకుందామని, అసలు సాధన చేయటానికి ఒకడు ఉంటే కదా! నువ్వు ఉన్నావని నేను లేనని ఇప్పుడే కదా నాకు తెలిసింది అన్నాడు.

పెరుమాళ్ళు అంటే, భగవంతుడు అంటే, నమ్మాళ్వారికి ఎంత ఇష్టం అంటే మనం రామ, కృష్ణ అని నోటితోటి అనుకోవడం కూడా ఆయనకి ఇష్టం ఉండదు. ఈ నోటితోటి దేవుడి యొక్క నామాన్ని ఎందుకు ఎంగిలి చేస్తున్నాము అనేవారు. ఏమి భక్తో చూడండి, భక్తిని ఎంత శిఖరాలలోకి తీసుకు వెళ్ళాడో చూడండి. మనం హరే రామ హరే కృష్ణ అని

అనుకుంటూ ఉంటాము కదా, ఈ మాటలు కూడా నమ్మాళ్వారికి ఇష్టం ఉండదు. హరే రామ హరే కృష్ణ అని అనుకోవడం కూడా ఎందుకు? దేవుణ్ణి ఆ ఎంగిలి నోట్లో వేసి మైలు చేసేస్తున్నారు. మీ పాచి నోట్లో పడేసి ఆ దేవుణ్ణి అపరిశుభ్రం చేసేస్తున్నారు. అవి వినలేక తల వంచుకొని, అసలు కీర్తనలు కూడా చేసేవాడు కాదు ఆయన. భక్తిని ఎంతటి శిఖరాలకి తీసుకెళ్లాడో నమ్మాళ్వారు చూడండి! రామ, కృష్ణ అని కూడా అనేవాడు కాదు. అనకూడదు అని కాదు. మళ్లీ ఈ నోట్లో భగవంతుని నామాన్ని పెట్టటం ఎందుకు, ఈ అపరిశుద్ధమైన నోటితో భగవంతుని నామం అనటం ఎందుకు అని. ఆ భక్తి చూడండి ఆ హృదయంలో ఉన్న ప్రేమ చూడండి ఎంత దూరం తీసుకెళ్ళాడో. ఇదంతా వెర్రితనం కింద మనకు కనిపించవచ్చు.

మద్రాసులో మైలాపూర్లో రామకృష్ణ మఠం పెట్టిన కొత్తలో సరిగ్గా బిల్డింగ్ అదీ లేనప్పుడు, వేసవికాలంలో ఎండలు బాగా కాస్తుంటే రామకృష్ణుడి పటానికి విసిన కర్ర పెట్టి విసిరేవారంట ఆయన. రామకృష్ణుడికి ఉడుకు పెడుతుందని. అది రామకృష్ణానంద యొక్క భక్తి. ఆ మఠం తాటాకులతో ఉన్నప్పుడు, ఈ బిల్డింగులు అవి కట్టనప్పుడు, ఎప్పుడైనా చినుకులు పడితే చలి పెడుతుందేమో, వర్షం కురుస్తుందేమో అని రామకృష్ణ పటానికి, ఆయన దానిని పటం కింద చూడలేదు. సజీవంగా ఉన్నట్టు రక్త మాంసాలు ఉన్నమనిషిని ఎలా చూస్తామో ఆ పటాన్ని కూడా అలాగే చూసారు. గురువు మీద అంత భక్తి కాబట్టి, అతనికి ఆ పేరు. రామకృష్ణుని పేరు నేను కూడా పెట్టుకోను అతనికే నిజమైన భక్తి ఉందని అతనికే ఆ పేరు పెట్టాడు వివేకానందుడు. అతడే రామక్రిష్ణానంద. అతనే మద్రాసు మఠాన్ని ప్రారంభించారు.

వివేకానంద ఎక్కడో కలకత్తాలో శరీరం విడిచిపెడుతుంటే, మొట్టమొదట హృదయంలో రామకృష్ణానందని తలిచాడు. రామకృష్ణానందని శశి అని పిలిచేవారు. ఓ శశి నేను వెళ్ళిపోతున్నాను. మనిషి ఏ విధంగా అయితే ఉమ్మివేస్తాడో అదే విధంగా ఈ శరీరం విడిచిపెట్టి నేను వెళ్ళిపోతున్నాను శశి అన్నాడు. ఎక్కడ కలకత్తా, ఎక్కడ మద్రాసు. కలకత్తా విడిచిపెట్టి మద్రాసులో కొంత కాలం ఉండాలని, అక్కడ మఠాన్ని అభివృద్ధిలోకి తీసుకురావాలని నరేంద్రుడు రామకృష్ణానందను బలవంతాన్న పంపాడు. చివరి రోజుల్లో చూడటానికి ఇద్దరికీ అవకాశం రాకపోతే, శరీరం విడిచి పెట్టేటపుడు నరేంద్రుడు చెబుతున్నాడు అతని హృదయంలో. ఓ శశి నేను వెళ్ళిపోతున్నాను. మనిషి ఉమ్మి ఎలా అయితే వేస్తాడో, అలాగే నేను శరీరాన్ని ఇక్కడ విడిచిపెట్టేసి వెళ్ళిపోతున్నాను శశి అంటాడు. వివేకానంద శరీరం విడిచిపెట్టేసినట్టు శశికి మద్రాసులో స్ఫురించింది.

భగవద్గీతలో పదిహేనవ అధ్యాయంలో చెప్పారు. శరీరం వదిలి పెట్టిన తరువాత కూడా జీవుడు ఎలా ప్రయాణం చేస్తున్నాడో జ్ఞానులకి తెలుస్తూ ఉంటుంది. జ్ఞానికి, భగవంతునికి తేడా ఏమీ లేదు. జ్ఞానికి, భగవంతునికి తేడా చూడటం అపచారం. మనకున్న భక్తి నిజమైన భక్తి అయితే, యదార్ధమైన భక్తి అయితే ఆ భక్తిలోనే ముక్తి ఉంటుంది. ఎటువంటి పరిస్థితుల్లో కూడా మీ మనసులో గందరగోళం పెట్టుకోవద్దు. మీరు గందరగోళం పెట్టుకుంటే సాధన చేయటానికి మళ్ళీ వెనక్కి రావాలి, సాధన చేసి ప్రయత్నం చేసి మళ్ళీ మనస్సుని సరైన కండిషన్ లో పెట్టుకోవలసి ఉంటుంది. గందరగోళం పెట్టుకొనే కొలదీ మీరు నష్టపోతారు. ఈ శరీరానికి అనారోగ్యం వచ్చినా కూడా మీరు పెద్దగా నష్టపోయేది ఏమీ ఉండదు. మీకు డబ్బు కొంచెం తక్కువైనా మీరు నష్టపోయేది ఏమీ ఉండదు. మీకు చదువు తక్కువైనా మీరు నష్టపోయేది ఏమీ లేదు. కాని మాటిమాటికి మీ మనసుని గందరగోళంలో పెట్టుకుంటే, మళ్ళీ అంత ప్రయత్నం చేసి, సాధన చేసి ఆ గందరగోళాన్ని తగ్గించుకోవాలి. అశాంతిగా ఉన్న మనసు భగవంతుని వైపు దారి చూపించదు. సాధ్యమైనంత వరకు ఎమోషన్‌కి దూరంగా ఉండండి. చాలామంది ఎమోషన్ డివోషన్ అనుకుంటారు. ఎమోషన్ డివోషన్ కాదు.

శ్రీరామచంద్రమూర్తికి, వాసుదేవస్వామికి జ్ఞానం ఉందా? వాళ్ళిద్దరూ జ్ఞానులేనా? అని రమణ స్వామిని ఒకరు ప్రశ్న అడిగారు. అపుడు రమణస్వామి చెప్పిన సమాధానం చూడండి. ఎవరు పేరు స్మరిస్తుంటే మనకు జ్ఞానం కలుగుతోందో వాళ్ళు జ్ఞానం లేకుండా ఉన్నారా? రాముడి నామం స్మరిస్తే మనకు జ్ఞానం వస్తుంది. కృష్ణుడి నామం స్మరిస్తే మనకు జ్ఞానం వస్తుంది. వాళ్ళ పేర్లు స్మరిస్తేనే మనకు జ్ఞానం వస్తుంటే వాళ్ళు జ్ఞానం లేకుండా ఎలా ఉంటారయ్యా? ఎంత వండర్ఫుల్ రిప్లై! ఎంత బ్యూటిఫుల్ రిప్లై ఇచ్చారో చూడండి.

ఇంతకి ఇవాళ సబ్జెక్టు ఏమిటి? మీ మెంటల్ బ్యూటీని మీ మెంటల్ స్ట్రెంగ్త్‌ని, మీ కాన్సంట్రేషన్‌ని, మీ డివోషన్‌ని పెంచుకోండి. మానసిక జీవితం ఎలా ఉంటుందో రుచి చూడండి ఒకసారి. ఇంతకాలం ఎన్నో వస్తువులు రుచి చూసారు కదా, మీరు మానసిక జీవితం కూడా రుచి చూడండి. మీరు రుచి చూడకుండా ఏమీ విడిచి పెట్టేయటం లేదు కదా అన్నీ రుచి చూస్తున్నారు. అలాగే మీ మానసిక జీవితం కూడా ఒకసారి రుచి చూడండి ఎలా ఉంటుందో? రుచి చూస్తే అప్పుడు తెలుస్తుంది ఎలా ఉంటుందో.


ఏ చదువైతే మన మనసు యొక్క లోతులని పెంచలేదో, ఏ చదువైతే మన మనసుని విశాలం చేయలేదో అది చదువు కానే కాదు. Love God. Always love God.

భగవంతున్ని ప్రేమించండి. మరింతగా ప్రేమించండి. More and more, మరింత మరింత ఎక్కువగా ప్రేమించండి. ఈ లోకంలో గాని, పరలోకంలో గాని, మీ యోగక్షేమాలు భగవంతుడు కంటే ఎక్కువగా కోరే వారు లేరు. ఒకవేళ మీరు భగవంతుడిని ప్రేమించటం లేదు అనుకోండి, ఇప్పుడు నేర్చుకోండి. డబ్బు లేని వాళ్ళు అందరూ ఏమి చేస్తున్నారు. డబ్బు సంపాదించటం నేర్చుకుంటున్నారు. చదువు లేని వాళ్ళు అందరూ ఏమి చేస్తున్నారు, చదువుకోవటం నేర్చుకుంటున్నారు. గౌరవాల కోసం కొంతమంది గౌరవాలు ఎలా సంపాదించాలో నేర్చుకుంటున్నారు. అదే విధంగా భగవంతుని ప్రేమించటం చేతకాదు అనుకోండి. నేర్చుకోండి. మనకి డబ్బు లేకపోతే డబ్బు సంపాదించటం నేర్చుకోవట్లేదా? అలాగే భగవంతుని ప్రేమించండి. Love him, Always love him, more love him, more and more love him, more and more, more and more love him!

మీ కాలాన్ని భగవంతుని కోసం ఖర్చు పెట్టండి. వంద సంవత్సరాలు, ఎనభై సంవత్సరాలు జీవిస్తున్నారు కదా. ఎన్ని సంవత్సరాలు, ఎన్ని రోజులు ఈశ్వరునికి సమర్పిస్తున్నాము, రోజులో ఎన్ని గంటలు ఈశ్వరునికి ఇస్తున్నాము? ఇరవై నాలుగు గంటల్లో ఒక ఎనిమిది గంటలు నిద్రకి తీసేయండి ఇంకా పదహారు గంటలు ఉంటాయి అనుకోండి. ఈ పదహారు గంటలు మనం జాగ్రదావస్థలో ఉంటాం అనుకోండి. పదహారు గంటల్లో పదహారు నిమిషాలు ఏమైనా ఇస్తున్నామేమో ఈశ్వరునికి ఇస్తే, మిగతా టైం అంతా ప్రకృతికే. కొంతమంది అంటారు మేము అభివృద్ధిలోకి రావడం లేదు అంటారు. పదహారు గంటల్లో, పదహారు నిమిషాలు ఈశ్వరుడికి ఇచ్చి, మిగతా టైం అంతా ప్రకృతిని స్మరిస్తూ ఉంటే వాడు అభివృద్ధిలోకి ఏమి వస్తాడు? ఒక రూపాయి సంపాదిస్తున్నాడు, అది నిజమే. ఖర్చు ఎంత పెడుతున్నాడు? మూడు రూపాయలు పెడుతున్నాడు ఇంక నిల్వ ఏమి ఉంటుంది వాడికి? నేను పదహారు గంటల్లో పదహారు నిమిషాలు దేవుణ్ణి స్మరిస్తున్నాను. మిగతా టైమ్ అంతా ప్రకృతిని స్మరిస్తున్నాను. నేను ముందుకి వెళుతున్నానా? వెనక్కి వెళుతున్నానా?

భగవంతుని మోసం చేయటానికి ప్రయత్నం చేయకండి. భగవంతుడు తెలివి తక్కువ వాడు కాదు. మీ హృదయంలో ఉండే తలంపు మీకు తెలియక ముందే ఆయనకి తెలుసు మీ హృదయంలో ఏ తలంపు ఉందో, వాడు ఈశ్వరుడు! నా హృదయంలో ఈ తలంపు ఉందని తలంపు వచ్చే వరకూ నాకు తెలియదు. తలంపు పుట్టక ముందు కూడా నా హృదయంలో ఏ తలంపు ఉందో వాడికి తెలుసు, వాడు ఈశ్వరుడు!

**ఓంశాంతిః శాంతిః శాంతిః !**



# అరుణాచల మహత్మ్యం
# అక్షరమణమాల

**పంచేంద్రియ ఖలులు మదిలోన దూరుచో**

**మదిని నీవుండవో అరుణాచలా॥**

తాత్పర్యము: పంచేంద్రియాలు అనే ముష్కరులు నా మనస్సులో ప్రవేశిస్తే, అక్కడ నీవుండవా అరుణాచలా? మరి అక్కడ ఉండక నీవు ఎక్కడికి పోతావు? పోవటానికి నీవు లేని చోటు ఎక్కడ ఉంది?

అక్షరమణమాలలో రమణ స్వామి ఈ ఇంద్రియాలని దొంగలు అన్నాడు. నా జేబులో ఐదు రూపాయల కాగితం ఉంది. నా జేబులో ఉన్న ఐదు రూపాయల కాగితం నేను తీసుకుంటాను. నేను దొంగవాడిని ఎలా అవుతాను. ఇక్కడ లాజిక్ ఏమిటి? నా జేబులో ఉన్న ఐదు రూపాయలు నేనే తీసుకుంటే, నేను దొంగవాడిని అవుతానా? మీ జేబులో ఉన్న ఐదు రూపాయలు నేను తీసుకుంటే, అప్పుడు నేను దొంగవాడిని అవుతాను. నా జేబులో ఉన్న ఐదు రూపాయలు నేను తీసుకుంటే, నేను దొంగవాడిని అవ్వను. కాని ఇక్కడ ఏమంటున్నాడు రమణ స్వామి!

పంచేంద్రియ ఖలులు మదిలోన దూరుచో మదిని నీవు ఉండవోయి అరుణాచలా! మది అంటే మనస్సు, ఖలులు అంటే దుర్మార్గులు, దొంగలు. ఇప్పుడు నా మనస్సుని నా ఇంద్రియాలే లాక్కొని వెళ్లిపోతున్నాయి కదా. నా మనస్సుని నా ఇంద్రియాలే లాక్కొని వెళ్లిపోతుంటే, నా ఇంద్రియాలు దొంగలు ఎలా అవుతాయి అండీ? ఇదేమి పద్ధతి, ఇది న్యాయంగా ఉందా!

ఇంద్రియాలు స్మశానంలో కాలిపోతాయి అనుకొంటున్నాము, అవి కాలవు. కట్టెల వల్ల వచ్చే అగ్నికి ఇంద్రియాలు కాలవు, కోపం వల్ల వచ్చే అగ్నికి ఇంద్రియాలు కాలవు, ఒక జ్ఞానాగ్నికి మట్టుకే కాలతాయి. నేను నువ్వు కూడా అజాగ్రత్తగా ఉంటామనుకో, నా

ఇంద్రియాలనే ఈ దొంగలు వచ్చి నా మనస్సుని బయటికి లాక్కెళ్ళిపోతాయి. నేను ఏదో అరుణాచలా అరుణాచలా అని ఒక్కోసారి అంటూ ఉంటాను, ఒకోసారి అనను. , నేను అస్తమానూ జాగ్రత్తగా ఉండలేను, నేను జీవలక్షణాలతో ఉన్నాను. నేను ఒకప్పుడు జాగ్రత్తగా ఉంటాను, ఒకప్పుడు అజాగ్రత్తగా ఉంటానయ్యా! నువ్వు మట్టుకు ఎప్పుడూ జాగ్రత్తగా ఉండు అంటున్నాడు. గార్డియన్ గా రక్షణ అంతా అరుణాచలేశ్వరుడికే విడిచిపెట్టేస్తున్నాడు. ఏమో నా మాట ఏంటో నేను ఏమి చెప్పగలను, ఈ మనస్సు కుదురుగా ఉంటుందో లేదో! మనస్సు స్థిరంగా ఉండదు, కుదురుగా ఉండదు, గంటకో అవతారం ఎత్తుతుంది కదా. ఏమో ఎప్పుడు ఎలా ఉంటుందో! నువ్వు మట్టుకు జాగ్రత్తగా ఉండు సుమా! నేను అజాగ్రత్తగా ఉండి, నువ్వు కూడా అజాగ్రత్తగా ఉంటే, నువ్వు ఏమరుపాటుగా ఉంటే, నా కొంప ముంచేస్తాయి ఈ ఇంద్రియాలు. నువ్వు అజాగ్రత్తగా ఉంటే ఎలాగ! నువ్వు జాగ్రత్తగా ఉండు. నిన్ను కూడా మోసం చేసే లక్షణాలు ఇంద్రియాలకి ఉన్నాయి.

అయితే ఇక్కడ దొంగలు అన్నాడు బాగానే ఉందదండి. ఈ ఇంద్రియాలు ఎవరివి, నావి! ఈ మనస్సు ఎవరిది, నాది! పోనీ నా ఇంద్రియాలే నా మనస్సుని తీసుకుపోతుంటే దొంగలు అంటాడు ఏమిటి!కోర్టుకి వెళ్ళవలసిన గొడవే ఇది! భగవద్గీతలో భగవంతుడు ఒక మాట చెప్పాడు. మనస్సు అనేది భగవంతుడి సొత్తు కాని ఇంద్రియాల సొత్తు కాదు అన్నాడు. అందుచేత దొంగలు అన్నాడు. మనస్సు అనేది నా అంశ, జీవుడు అనేది నా అంశ. సూర్యుడి యొక్క కిరణం భూమి మీద పడవచ్చు. సూర్యుడి యొక్క కిరణాలు భూమి మీద పడినప్పటికీ, ఆకిరణం సూర్యుడిదే కాని భూమిది కాదు. అదేవిధంగా ఈ మనస్సు కూడా నా అంశ, ఈ జీవుడు నా అంశ. సనాతనంగా మేమిద్దరం వస్తున్నాము. నువ్వుఅంశవే,నావాడివే! మనస్సుకిపుట్టిల్లు ఆత్మ, జీవుడికి పుట్టిల్లు ఆత్మ. కాని పుట్టిల్లు ఇంద్రియాలు మట్టుకు కాదు. అంచేత మనస్సు ఈశ్వరుడి స్వరూపం కాబట్టి, జీవుడు ఈశ్వరుడి స్వరూపం కాబట్టి, అదిఇంద్రియాలది కాదు కాబట్టి, సొత్తుఇంద్రియాలది కాదు. మనస్సు ఎవరి సొత్తు? ఈశ్వరుడి సొత్తు! నువ్వునావాడివేకాని ఇంద్రియాలు దోచుకుపోతున్నాయి కాబట్టి నీ సొత్తుని నువ్వు కాచుకోవయ్యా. ఈ ఇంద్రియాలనే దొంగలు వస్తున్నాయి. ఈఇంద్రియాలు మనస్సుని బహిర్ముఖం చేస్తున్నాయి కాబట్టి, ప్రకృతి వైపు లాక్కెళ్ళి పోతున్నాయి కాబట్టి, మనస్సు ఇంద్రియాలది కాదు కాబట్టి, నీదే కాబట్టి, ఈఇంద్రియాలను పడగొట్టి నువ్వు జాగ్రత్త పడవయ్యా అరుణాచలేశ్వరుడా! పంచేంద్రియ ఖలులు మదిలోన దూరుచో మదిని నీవు ఉండవోయి అరుణాచలా!



# శ్రీమద్భగవద్గీత

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)

**- సేకరణ : బేబీ, హైదరాబాద్**

భగవద్గీతలో స్థితప్రజ్ఞ లక్షణాలు గురించిచెపుతూ జితేంద్రియుడు, అంటేఇంద్రియాలు జయించినవాడు అని చాలా శ్లోకాలలో వర్ణించారు. రాముడు జితేంద్రియుడు కాదు, అతీంద్రియుడు. జితేంద్రియుడు అంటే, ఇంద్రియాలు ఉన్నాయని తెలుస్తా ఉంటాయి, ఇంద్రియాలకి చాపల్యం ఉండదు. ఇంద్రియాలు ఉన్నాయని తెలిసిన వాడు వాటిని అదుపులో పెట్టుకుంటాడు, నియమించుకుంటాడు, వాడు జితేంద్రియుడు. రాముడు గీతలో చెప్పిన జితేంద్రియుడు కాదు, అతీంద్రియుడు. ఇంద్రియాలు ఉన్నా లేని వాడితో సమానం రాముడు. అసలు నాకు ఇంద్రియాలు ఉన్నాయి శరీరం ఉంది అని కూడా తెలియని వాడు. రాముడి లక్షణాలు మీకు కావాలంటే, రాముడు ఎటువంటి వాడో మీకు అర్థం అవ్వాలి అంటే పన్నెండవ అధ్యాయంలో భక్తి యోగంలో అన్నీ రాముడికి ఉన్న గుణాలనే కృష్ణుడు చెప్పాడు. రాముడు ఏ గుణాలైతే ఆచరించి చూపించాడో, అవే కృష్ణుడుమనకి నోటితో చెప్పాడు. ,

**అనపేక్షః శ్శుచిర్దక్షః ఉదాసీనో గతవ్యధః।**
**సర్వారంభ పరిత్యాగీ యోమద్భక్తస్సమే ప్రియః ॥ 12:16**

తాత్పర్యము: ఏమాత్రమూకాంక్ష లేనివాడును, శరీర ఇంద్రియ మనస్సుల యందు శుచియై ఉన్నవాడును, దక్షుడును, పక్షపాత రహితుడును, ఎట్టి దుఃఖములకును చలింపని వాడును, సమస్త కర్మలయందును కతృత్వాభిమానములు లేనివాడును అగు భక్తుడు నాకు ప్రియుడు.

వాసుదేవస్వామి ఇక్కడ భక్తుల లక్షణాలను చెపుతున్నాడు. మిమ్మల్ని చూసి నేను ఇష్టపడాలంటే మీరు ఎలా ఉండాలో గీతలో స్వామివారు చెపుతున్నారు. ఈ పద్ధతిలో

ఉంటే మీ పట్ల నాకు ప్రేమ కలుగుతుంది, అనుగ్రహం కలుగుతుంది అని చెపుతున్నారు.

అనపేక్షః - అపేక్ష ఎలా ఉంటుందో తెలియని వాడు. ఇది భక్తుడి లక్షణం. రాముడు దేనికీ ఎదురుచూడడు. మీరు కూడా మీ పని మీరు చేసుకోండి. మీ ప్రారబ్ధాన్ని బట్టి వచ్చేది వస్తుంది, రానిది రాదు. దేనికోసం ఎదురుచూడకండి. మీ ప్రారబ్ధంలో ఉన్నది పోదు, లేనిది వచ్చి అంటుకోదు. మీరు ఈ భక్తి గుణాలు సంపాదిస్తే మీరు రాముడి తోటి సమానం అవుతారు. అప్పడు మానవుడు దేవుడు అవుతాడు. మానవుడు రాక్షసుడు అవ్వకూడదు. మానవుడు దేవుడు అవ్వటానికే వాల్మీకి రామాయణం రాసాడు.

అనపేక్షః అంటే అపేక్ష లేకుండా ఉండటం,కోరిక లేకుండా జీవించటం. మనం చేసే పని ప్రశాంతముగా, నిర్మలముగా చెయ్యాలి. దాని ఫలం కోసం ఎదురుచూసినట్లుగా ఉ ండకూడదు. మంచి పని చెయ్యాలి, చేసి మరిచిపోవాలి. ఫలాన్ని కోరుకుంటే అది బంధిస్తుంది. కోరిక వల్ల దుఃఖం వస్తుంది. మీరు కోరుకోకుండా మీకు ఏదైనా వస్తే అది బంధకారణం అవ్వదు. కోరి తెచ్చుకుంటే అది దుఃఖకారణం బంధకారణం అవుతుంది.

చాలామంది మేము ధ్యానం చేస్తున్నాము, మనస్సు నిలబడటం లేదు అంటారు. మమకారం ఉన్నచోట ధ్యానం కుదరదు. మీకు ఎక్కడా మమకారం లేదనుకోండి, మనస్సు చలించదు, బయటికి పోదు. మీకు ఎక్కడ మమకారం ఉంటే మనస్సు అక్కడికి వెళ్లి వాలుతుంది. మమకారం లేకపోతే మనస్సు అంతర్ముఖం గానే ఉంటుంది కాని బాహ్యాముఖం అవ్వదు. ప్రపంచంలో ఎవడు తప్పు చేసినా ఏదైనా పాపం చేసినా మమకారం కోసమే చేస్తాడు. నీకు మమకారం లేనప్పుడు నువ్వు అసలు తప్పు చెయ్యవలసిన పని లేదు. నువ్వు నీ చేతిలో ఉన్న పని శ్రద్దగా భక్తిగా చెయ్యి. నీకు ఫలితం అనుకూలంగా ఉండవచ్చు, ప్రతికూలంగా ఉండవచ్చు. ఎక్స్‌పెక్టేషన్ ఉన్నవాడికి డిజప్పాయింట్‌మెంట్ వస్తుంది కాని ఎక్స్‌పెక్టేషన్ లేనివాడికి డిజప్పాయింట్‌మెంట్ లేదు. అందుచేత నువ్వు అపేక్ష లేకుండా పని చెయ్యి అన్నాడు పరమాత్మ. ఫలితం రాదు అనటంలేదు భగవంతుడు, నీ వంతుకి వచ్చేది వస్తుంది, రానిది రాదు.

శుచిః - ఎప్పుడూ శుచిగా ఉండాలి అది భక్తుడి లక్షణం. నీ శరీరాన్ని బట్టలని ఎంత శుచిగా ఉంచుకొంటావో అలాగ నీ మనస్సు కూడా అంత శుచిగా ఉండాలి. లోపల బయట కూడా శుచిగా ఉండాలి. కుండబయట లోపల కూడా శుభ్రంగా ఉండాలి. మన భారతదేశంలో శుభ్రత అనేదానికి ప్రాధాన్యత అంతగా లేదు. దేవుడి తరువాత దేవుడితో సమానమైన ప్రాముఖ్యత శుచికి ఉండాలి.

కొందరి ముఖాలు ఎప్పుడూ ఎదో పోగొట్టుకున్నట్టు ఉంటాయి. అలా ఉండకూడదు, మీరు శుచిగా శుభ్రంగా ప్రకాశవంతంగా ఉండాలి. కొంతమంది ఎప్పుడూ ఇతరులలోని దోషములను చూస్తూ ఉంటారు. మనస్సును అంతర్ముఖం చేసుకొని వాళ్ళ దోషములను వారు చూసుకోరు. ఇతరులలోని దోషములను చూస్తూ ఉంటే అశుచి పెరిగిపోతుంది అని రామకృష్ణుడు చెప్పారు. దీని వలన రెండు నష్టాలు - వారు బాగుపడరు, కాలంఖర్చు అయిపోతుంది. మరణించాక వాళ్లకి నరకలోకం మిగులుతుంది. శుచి అవ్వాలి అంటే, మన మనస్సు, శరీరం, వాక్కు నిర్మలంగా నిశ్చలంగా ఉండాలి. మీరు మాట్లాడుతుంటే ఇతరులకు చల్లదనం కలుగజేయాలి. వారిలో ఏమైనా దుఃఖం ఉంటే, ఆ దుఃఖాన్ని తగ్గించాలి. వారి చైతన్యస్థాయి పెరగాలి. మనస్సులో వాక్కులో చేతలో దోషం లేకుండా చూసుకుంటే మీరు శుచివంతులు అవుతారు. రోజూశరీరానికి నీళ్ళతో స్నానం ఎలా చేయిస్తారో, అలా మనస్సుకి ప్రార్ధనతో స్నానం చేయించండి అనేవారు గాంధీ గారు. భగవంతుని రోజూ ప్రార్థించండి, మీ మనస్సు వాక్కు శరీరం శుచి అవుతాయి. కొంతమందికి మనస్సులో ఒకటి ఉంటుంది, నోటితోటి ఒకటి మాట్లాడతారు, చేత్తోటి మరొకటి చేస్తూ ఉంటారు. అంటే వాళ్ళ మనస్సుకి మాటకి సంబంధం ఉండదు, మాటకి చేతకి సంబంధం ఉండదు. వాళ్లు వక్రంగా ఉంటారు, వంకరగా ఉంటారు, వాళ్లకిశుచి కలగదు, భక్తిమార్గం లోకి రావాలన్నా రాలేరు. అంచేత మీ మనస్సు వాక్కు శరీరము నిదానంగా ఉంటే, సరళంగా ఉంటే, మీరు శుచివంతులు అవుతారు. మీ మనస్సును శుచిగా ఉంచుకుంటే బాహ్యంగా మీ స్నేహితులు చేయలేని ఉపకారం మీ మనస్సు మీకు చేసి పెడుతుంది, మీ మనస్సు మీకు స్వాధీనం లోకి వచ్చే కొలది మీకు సుఖం తెలుస్తుంది, మీకు జ్ఞానం కలగజేస్తుంది.

దక్షః - మీరుపని చేసేటప్పుడు సమర్ధవంతంగా చెయ్యాలి, పనిలో నేర్పు ప్రవీణత కనబడాలి. భక్తుడి యొక్క లక్షణం ఆ పనిలో కనబడాలి. పనిలో దేవుడిని చూస్తూ, పనిలో మీ సమర్ధత, నేర్పు, యుక్తి చూపించాలి. వాడు దక్షుడు. అటువంటి భక్తుడు అంటే నాకు ఇష్టం, వాడు నాకు ప్రియుడు అని స్వామి వారు చెపుతున్నారు. మీరు ఏ పని చేసినా సమగ్రంగా ఉండాలి, పరమేశ్వరుడికి నైవేద్యంగా ఉండాలి. నేను చేస్తున్నాను అనే భావన కాకుండా, పరమేశ్వరుడే ఈ శరీరాన్ని ఉపయోగించుకొని ఈ పని చేసాడు అనే భావనతో చెయ్యాలి. ఏదైనా పనిచేస్తే ఈపనిలో వారికి వారే సాటి అన్నట్టు ఉండాలి. మనిషికి ప్రొఫిషియన్సి (proficiency) ఒకటే సరిపోదు, ఎఫిషియన్సీ (efficiency) కూడాఉండాలి అని స్వామివారు చెపుతున్నారు. ఒట్టి మాట కాదు, ఆ మాటలకు తదనుగుణంగా ఆ పనిలో నేర్పు ఉండాలి.

జీవితంలో సమర్ధత లేకపోతే మీరు సమగ్రంగా అభివృద్ధి పొందలేరు.

మీరు అమాయకత్వంగా ఉండకూడదు. వ్యవహారాలలో దక్షత ఉండాలి. కొంతమందికి వ్యవహారం ఎలా పరిష్కరించాలో ఆ తెలివితేటలు ఉంటాయి, ఎంత కష్టమైన సమస్య వచ్చినా పరిష్కారం చేసేస్తారు. వాడిని దక్షుడు అంటారు. కొంతమంది డాక్టరులు సర్జరీ ఎంత బాగా చేస్తారు అంటే అసలు ఆ ముఖం కూడా నలగదు. అంత నేర్పుగా చేస్తారు. అందుచేత మీరు చేత్తోటి చేసే పనిలో కూడా దక్షత ఉండాలి. నోటితోటి వాగటం కాదు, చేతిలోకూడా స్కిల్ ఉండాలి. కొంతమందికి సమస్యలు వస్తే భయపడతారు. సమస్య వచ్చినప్పుడు మనం ఫేస్ చెయ్యాలి కాని భయపడకూడదు. అది ఎలా పరిష్కరించుకోవాలో దానికున్న తెలివినే దక్షః అంటారు.

ఉదాసీనః - పక్షపాత రహితంగా ఉండాలి. మీరు ఎవరి పట్లా పక్షపాతం లేకుండా, మీరు చేసే పనిలో నిష్పక్షపాతంగా ఉండాలి. శరీరానికి పక్షవాతం వస్తుంది, మనస్సుకి పక్షపాతం వస్తుంది. శరీరానికి పక్షవాతం రాకుండా ఎలా చూసుకొంటున్నారో, అలా మనస్సుకి పక్షపాతం రాకుండా చూసుకోవాలి. అందరిని సమానంగా గౌరవించాలి, ప్రేమించాలి, బోధించాలి. అందుకొనేవారు అందుకుంటారు, అందుకోలేనివారు అందుకోలేక పోవచ్చు. అది వారికి సంబంధించిన విషయం. కొంతమంది ప్రతిచిన్న విషయానికి ఎటో ఒకవైపు ఒరిగిపోతారు, నిదానంగా క్రమంగా ఆలోచించలేరు. వంకరవంకరగా ఆలోచిస్తారు. అటువంటిది పనికిరాదు, అది భక్తుడి లక్షణం కాదు. ఎవడైతే అటుఇటూ ఒరిగిపోకుండా జీవిస్తున్నాడో, ఎవడైతే పక్షపాతం లేకుండా జీవిస్తున్నాడో, బంగారం అమ్మేవాడు ఎంత జాగ్రత్తగా తూకం తూస్తాడో, అంత జాగ్రత్తగా ఎవడైతే తన బుద్ధిని చూసుకొంటున్నాడో, వాడు భక్తుడు అవుతాడు. ఈ గుణాలను మీరు అలవరచుకొంటే నా స్వరూపము మీకు తెలుస్తుంది. మీ హృదయంలో నేను ఉన్నాను, మీకు నేను వ్యక్తమవుతాను అని భగవంతుడు చెపుతున్నాడు.

ఎవరైనా ఇద్దరు దెబ్బలాడుకుంటూ ఉంటే వాళ్లకి ఎందుకు పేచీ వచ్చింది, ఆపేచీకి కారణం ఏమిటి, ఎవరిది తప్పు, ఎవరిది ఒప్పు అని అర్థం చేసుకుని మీరు పరిష్కారం చెయ్యాలి కాని, ఏమీ అర్థం చేసుకోకుండా ఎవడో ఒకడి తరపున కలబడి పోవటం తప్పు అని కృష్ణుడు చెపుతున్నాడు. భక్తులు లోకవ్యవహారాలలోకి ఎక్కువ వెళ్లకూడదు. దాని వల్ల దేహాభిమానం పెరిగిపోతుంది. అతి పనికిరాదు.

గతవ్యదః - కొంతమందికి బెంగపెట్టుకొనే అలవాటు ఉంటుంది. ప్రతి చిన్న విషయానికి

బెంగపెట్టుకొంటారు. అస్తమానూ జరిగిపోయిన గొడవలు తలపెట్టుకొని బాధపడితే మీకు సుఖం లేదు. జరిగిపోయిన గొడవలు తలపెట్టుకోవటం వల్ల,జరగబోయేగొడవలు ఊహించుకోవటం వల్ల, ఏమీ కలిసిరాదు. మీ చేతిలో ఉన్న వర్తమాన కాలం వెళ్ళిపోతుంది. వర్తమానకాలాన్ని సరిగ్గా ఉపయోగించుకోండి. మీరు సాధన వర్తమాన కాలంలో చెయ్యాలి. మీరు వర్తమాన కాలంలోనే బాగుపడాలి. ఈ వర్తమానకాలం వదిలేసి అస్తమానూ జరిగిపోయిన గొడవలు తలపెట్టుకొని ఏడుస్తూ కూర్చోకండి, మీరు పాడైపోతారు అని భగవంతుడు చెబుతున్నాడు.

వర్తమానకాలాన్ని ఉపయోగించుకో. భూతకాలం ఒకప్పుడు వర్తమాన కాలమే. భవిష్యత్తుకాలం కూడా ఏదో ఒక టైములో వర్తమానకాలంలోకి వస్తుంది. నీ చేతిలో ఉన్న వర్తమానకాలాన్ని నువ్వు ఉపయోగించుకుంటే నువ్వు బాగు పడతావు, నువ్వు యోగివి అవుతావు. ప్రతీ చిన్నవిషయానికి బెంగ పెట్టుకోకు, నిన్ను నువ్వు బాధ పెట్టుకోకు. కొంతమంది వాళ్ళని వాళ్ళే బాధ పెట్టుకొంటూ ఉంటారు, వాళ్ళని వాళ్ళే హింస పెట్టుకొంటూ ఉంటారు. నువ్వు కూడా జీవుడివే, ఈశ్వరుడి యొక్క అంశవే. ప్రతీ చిన్న విషయానికి నిన్ను నువ్వు పుండు చేసుకొని, నిన్ను నువ్వు బాధ పెట్టుకున్నా, దేవుని అనుగ్రహానికి దూరం అయిపోతావు. ఇతరులను బాధ పెట్టటం కాదు, మిమ్మల్ని మీరు కూడా అస్తమానూ బాధ పెట్టుకోకండి. ప్రతీ చిన్న విషయానికి చింత పెట్టుకొని, బెంగ పెట్టుకొని కాలిపోతూ ఉంటే, మీకు భక్తి కలగదు. భక్తి లేకపోతే మీకు ముక్తి కలగదు. ప్రతీ చిన్న విషయానికి బెంగ పెట్టుకుంటే మీరు చేతిలో ఉన్న పని చెయ్యలేరు. అందుచేత జరిగిపోయిన గొడవలు తలపెట్టుకోకుండా వర్తమానకాలాన్ని, మీరు సద్వినియోగం చేసుకోండి.

సర్వ ఆరంభ పరిత్యాగి - అన్ని ఆరంభాలు వదిలివేయండి. అంటే స్వార్థ పూరితమైన పనులు వదిలివేయండి. మీరు ఏ పని చేసినా కర్తృత్వం లేకుండా, అహంకారం లేకుండా, రాగద్వేషాలు లేకుండా, వ్యక్తీభావన లేకుండా పని చెయ్యండి. అది మిమ్మల్ని అంటదు. అది మీ పునర్జన్మలకు కారణం అవ్వదు. కొంతమంది స్వార్థ ప్రయోజనం ఉంటే ఎదుటి మనిషితోటి మాట్లాడతారు, కలిసిరాదు అనుకుంటే ఎదురుగా కనిపించినా వాడు చుట్టమైనా, స్నేహితుడు అయినా పలకరించరు. కొందరిస్వభావం ఎలా ఉంటుందంటే, మా ఇంటికి వస్తే మీరేమి తెస్తారు, మీ ఇంటికి వస్తే మాకేమిస్తారు. వాళ్ళకి కలిసిరాకపోతే అసలు మనవంక చూడరు వాళ్ళకి కలిసివస్తే వెళ్ళి పొగుడుతారు. వాళ్ళకి ఎవరివల్ల అయితే ఉపకారం ఉందో వాళ్ళని స్తోత్రం చేయటం. వీళ్ళు పాడైపోవటం వాళ్ళని పాడుచెయ్యటం. వాళ్ళని నువ్వు రాముడు అంతటి

వాడవు, శివుడుఅంతటి వాడవు అనటం, వాళ్ళు నిజం అనుకోవటం పాపం! దానితో ఉన్న భక్తి పోతుంది. అక్కడి నుంచి అజ్ఞానం అహంకారం పెరగటం, మళ్ళీ ఈ మాయలో కూరుకుపోవటం.

మీరు ఏ పని చేసినా స్వార్థం కేంద్రం కాకూడదు. ఈశ్వరానుగ్రహం పొందటం కోసం పని చేయండి. అందరూ అభ్యాసాలు, ధ్యానాలు,పెద్ద పెద్ద పూజలు, యజ్ఞాలు, యాగాలు చేయలేరు. ఎవరో చేసారని మీకు చేసే శక్తి లేదని బాధ పడకండి. పెద్ద పెద్ద పనులు పెద్దవాళ్ళకి వదిలేయండి. నాకు ఇష్టమైన పనులు, నేను మెచ్చే పనులు చిన్నవి అయినా,శ్రద్ధగా ప్రేమగా చేయండి. మీరుఎంత చిన్న పని చేసినా పర్లేదు, ఆ పని వల్ల మీమీద నాకు ప్రేమ కలగాలి. మీరు ఎలా చేస్తే, మీ మీద నాకు అనుగ్రహం దయ కలుగుతుందో అలాగ చేసి తరించండి అని స్వామి వారు చెపుతున్నారు. ఒక పని చేసేటప్పుడు మనం సమాజాన్ని ప్రపంచాన్ని మోసం చెయ్యగలం కాని భగవంతుడిని మోసం చెయ్యలేము. బయట ఉన్న దేవుడిని గుళ్ళో దేవుడిని మోసం చెయ్యగలం కాని హృదయంలో ఉన్న దేవుడిని మోసం చెయ్యలేము. ఎంచేతంటే ఆయన అంతర్యామి, మన ఆలోచనలని మన తలంపులని చూస్తూ ఉంటాడు. మీరు చేసే పనులు పదిమందికి ఉపయోగపడాలి, చల్లదనం కలుగజేయాలి. చాలామంది వాళ్ళకి గొప్ప వస్తుంది, ఆ పని చేస్తే అందరూ మెచ్చుకుంటారు అంటే చేస్తారు కాని, ఇది పదిమందికి ఉపయోగ పడుతుందా లేదా అని మట్టుకు ఆలోచించి చెయ్యరు. మీరు ఏదైనా పని చేస్తే ఒకటికి పదిసార్లు ఆలోచించి, ఇది పదిమందికి ఉపయోగ పడుతుంది అంటే చెయ్యండి. భగవంతుడు అనుగ్రహం కలిగే పనులు చెయ్యండి, భగవంతుని అనుగ్రహం ఎప్పుడైతే వచ్చిందో అప్పుడు ఆయన స్వరూపం మీకు దొరుకుతుంది. అప్పుడు చెరువులో పడ్డ చేప ఎంత సుఖంగా ఉంటుందో, మీరు కూడా అంత సుఖంగా అంత శాంతిగా ఉండవచ్చు, అని రామకృష్ణుడు చెప్పాడు. కొంతమంది ద్వేషంతోటి, కొందరు స్వార్థాన్ని దృష్టిలో పెట్టుకొని పనులు చేస్తారు. మీరు స్వార్థపూరితమైన పనులు, అసూయతోటి చేసే పనులు, ద్వేషంతోటి ఇతరుల మీద కక్ష పెట్టుకొని చేసే పనులు అసలు మొదలుపెట్టవద్దు అంటున్నారు స్వామివారు.

ఈ సద్గుణాలతో ఎవరు అయితే ఉన్నారో, ఈ లక్షణాలతోటి ఎవరైతే విలసిల్లుతున్నారో వారు అంటే నేను ఇష్టపడతాను. మీ హృదయంలో ఈ గుణాలు కనుక ఉంటే, నాకు మీరు ప్రియులు అవుతారు, భక్తులు అవుతారు, మీపట్ల నాకు అనురాగం కలుగుతుంది అని వాసుదేవ స్వామివారు గీతలో చెప్పారు.

# మనోమూలం

ఆత్మ ఆధారముగానే సకల చరాచర జగత్తు ఉంది. నిత్యము పరిణామశీలమైన జగత్తుకి, ఆధారముగా ఉన్నది మార్పులేని అద్వయ చైతన్యమే! "మార్పుకు లోనయ్యే దేహేంద్రియ మనోబుద్ధులు నీవు కాదు, నీవు అసలు మారని వాడవు, శాశ్వతుడవు" అన్నది గురుబోధాసారం. మనస్సును అంతర్ముఖం చేసి, స్వరూపంలో నిలకడ చెందడానికే సమస్త సాధనలు. ఆత్మయే గురువు. లోకంలో మంచివారు, చెడ్డవారు అందరూ మనకు గురువులే! సమస్త సాధనలు అజ్ఞాన నివృత్తికేగాని, జ్ఞాన సముపార్జనకు కాదు. దేహాత్మబుద్ధిని వదలించుకోవడమే, సత్య సాక్షాత్కారానికి సూటిమార్గం. అనగా అహంకారం యొక్క మూలాన్ని పట్టుకోవడమే! బ్రహ్మమే, జగత్తుగా ఆయారూపాలలో కనిపిస్తోంది. ఆత్మకు, అభిన్నంగా చూడబడినప్పుడు జగత్తు సత్యమే! దృష్టిని అంతర్ముఖం చేస్తే, జగత్తు పరమాత్మమయంగా కనిపిస్తుంది. ఆత్మ అనంతం కాబట్టి, అందునా శరీరముతో సహా, సకలమూ చేరి ఉంది. నేను శరీరాన్ని కాదు, నేను ఆత్మను, అనెడి అనుభవాన్ని మించిన పుణ్యము లేదు. మనస్సు అంతర్ముఖం చేయబడినప్పుడు, పరమాత్మ అనంత చైతన్యముగా, స్వరూపంగా సాక్షాత్కరిస్తాడు. సాధన అనేది ఆత్మను పొందడానికి కాదు, దానికి ప్రతిబంధకముగా ఉన్న దేహాత్మబుద్ధిని వదిలించుకోవడానికే! మనోమూలమే భగవంతుడు, ఆత్మ, చైతన్యం లేదా నేను. కేవలం ఉన్నదే నేను. సర్వమునకు స్వరూపము ఆత్మయే.

**ఓం తత్ సత్**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# మనిషిలో ధైర్యం లేకపోతే - నీతి నిజాయితీగా ఉండలేడు

జీవితం యాంత్రికమైనది కాదు. ఊహకు ఏమాత్రం అదని అద్భుతమైన మర్మంతో కూడుకొన్నది. మరుక్షణం ఏమౌతుందో ఎవరికీ తెలియదు. అనిశ్చితులతో, ఆశ్చర్యాలతో కూడుకొన్నదే జీవితం. అదే దాని అందం. ఎంతటి పరిస్థితిలోనైనా అప్రమత్తతతో హృదయపూర్వకంగా స్పందించేవాడే తెలివైనవాడు. ఆ స్పందన ఎలాగో భగవాన్ తల్లికి పలకపై వ్రాసిన తొలి సందేశం "పరమేశ్వరుడు జీవులను వారి వారి ప్రారబ్ధము ననుసరించి ఆడిస్తున్నాడు. జరుగవలసినది జరిగే తీరును, జరుగరానిది ఎవరు ఎంత ప్రయత్నం చేసినా జరుగనే జరుగదు. ఇది సత్యం. అందుచేత ఊరకుండుట ఉత్తమం" అని వ్రాసారు. ఇది పూర్ణ శరణాగతికి సంకేతం. కానీ సాధకుడు మన కర్తవ్యం మనం చేసి మన చేతుల్లో లేనిది ఈశ్వరునిపై వేస్తే ఆయనే మోస్తాడు. శ్రీనాన్నగారు "మన సాధనలో నిజాయితీ ఉంటే మనకు గైడెన్సు అడుగడుగునా వస్తూనే ఉంటుంది" అన్నారు. మనకు ధైర్యం ఉంటే అప్పడే తక్కిన సహాయాలు అన్నీ వస్తాయి. పిరికివాడు తన భయాలకు తగినట్లు ప్రవర్తిస్తాడు. ఈ విషయంలో "నేను ఓడిపోయాను విజయం మీదే అనేవారిని ఎవరుమాత్రం ఏం చెయ్యగలరు?". వివేకానంద "ధైర్యవంతుడు ఒకసారే మరణిస్తాడు, పిరికివాడు రోజూ మరణిస్తాడు" అన్నారు. హృదయ మార్గమే ధైర్య మార్గము. ఒక పోలీసు అధికారి ముల్లా నసిరుద్దీన్ తలుపుతట్టి "ఇక్కడ నసిరుద్దీన్ నివసిస్తున్నాడా?" అని గద్దించాడు. దానికి 'లేదు' అని సమాధానం చెప్పగా అయితే 'నీ పేరు ఏమిటి?' అని గద్దించాడు. "ముల్లా నసిరుద్దీన్" అనగా "ఏమిటి నాటకాలు ఆడుతున్నావు?" అని ఆతని చిరిగిన చొక్కాను గుంజగా 'ఈ చిరిగిన చొక్కాలో అతను జీవిస్తున్నాడు' అంటాడు. గీతాచార్యుడు 'జీవుడు చిరిగిన వస్త్రాన్ని వదిలి క్రొత్త వస్త్రంలో జీవించినట్లే అలా తిరుగుతాడు" అన్నారు. నసీరుద్దీన్ భావము అది. జీవితం ఒక సమస్య ఏమాత్రం కాదు. దానిని సమస్యగా పరిగణిస్తే మనం తప్పటడుగు వేసినట్లే. జీవితాన్ని ప్రేమిస్తూ అనుభవించటమే జీవిత మర్మం. జీవితంలో అలసిపోయాను అనే నిరుత్సాహానికి ఏమాత్రం చోటు ఇవ్వకూడదు, సెగలు-పొగలు రానియ్యకూడదు, జీవితాన్ని ప్రవహింపచెయ్యాలి. రైల్వే స్టేషన్‌లో విశ్రాంతి గది ఉంటుంది. రైలు వచ్చేవరకూ కొన్ని నిమిషాలు సౌకర్యంగా ఉండవచ్చు, శాశ్వతంగా ఉండిపోము, అది మన సొంత ఇల్లు కాదు, రైలు రాగానే మన సామాను తీసుకొని వెళ్లిపోతాము. సరిగ్గా అలాంటిదే ఈ ప్రపంచ విశ్రాంతి గదిలో డభై లేదా ఎనభై సంవత్సరాలు ఉంటాము తప్ప శాశ్వతంగా ఉండము అనే ఎరుక ఉండాలి. ఆ కాలంలోనే సత్యాన్వేషణలో జీవించడం మంచిది. నేను ఎవడను? అనేది ముందుగా తెలుసుకోవలసిన ముఖ్య విషయం. 'నేను' అనేది మనం కాదు. అది కేవలం భయం మాత్రమే. ఆత్మకు ఎలాంటి భయం లేదు. అహంకారానికే ఎప్పడూ మరణ భయమే కారణం అది కృత్రిమమైనది. ప్రభుత్వ అధికారులు పై అధికారి సూచనలు అమలు చెయ్యకపోతే తొలగిస్తాడని భయంతో ఆ సూచనలు అమలు చేసి తదుపరి పరీక్షాకాలంలో కుళ్లిపోతాడు. ధైర్యవంతుడే తుది కాలంలో శాంతి - సుఖం అనుభవిస్తాడు. ఇది సత్యం.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966